# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ సోమవారం 27-10-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:63 పేజీలు:6 వెల: రూ.1/-


## చిన్నారిపై కుక్కల దాడి.. సీసీటీవీలో రికార్డ్

వరంగల్, అక్టోబర్ 26: వీధికుక్కలు దాడులు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. గ్రామాల నుంచి పట్టణాల వరకు ఈ దాడులు జరుగుతున్నాయి. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరినీ వీధి కుక్కలు విడిచిపెట్టడం లేదు. ఒంటరిగా కనిపిస్తే చాలు కుక్కలన్నీ ఒక్కటై ఎగబడి పీక్కుతింటున్నాయి. దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం చర్యలు తీసుకున్నా.. ఈ దాడులు మాత్రం ఆగటం లేవు. గ్రామ సింహాల దాడిలో చిన్నారి తీవ్రంగా గాయపడిన ఘటన మరొకటి వెలుగులోకి వచ్చింది. తెలంగాణలోని వరంగల్ జిల్లాలో ఈ ఘటన జరిగింది.

వరంగల్ న్యూషాయంపేటలో విషాద ఘటన జరిగింది. ఒంటరిగా రోడ్డుమీదకు వచ్చిన చిన్నారిపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఒక్క క్షణంలో కుక్కలన్నీ చిన్నారిపై పడి దాడి చేశాయి. ఒక కారు పక్కన సీసీ రోడ్డుపై చిన్నారి వేగంగా నడుస్తూ వెళ్తోంది. ఒక్కసారిగా తడబడి కిందపోయింది. పక్కనే పడుకొని ఉన్న ఒక కుక్క ఆ చిన్నారిపై దాడి చేసింది. వెంటనే అక్కడ ఉన్న కుక్కలన్నీ ఒక్కసారిగా అటాక్ చేశాయి. చిన్నారిని కింద పడేసి కొంత దూరం లాక్కెళ్లాయి. ఈ ఘటనను చూసిన ఒక వ్యక్తి, వెంటనే అప్రమత్తమై కుక్కలను తరిమి చిన్నారిని కాపాడాడు. చిన్నారిని తన కుటుంబ సభ్యులకు అప్పజెప్పాడు. గాయాలైన చిన్నారిని తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించారు. ఇందుకు సంబంధించిన ఘటన సీసీటీవీలో రికార్డ్ అయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఒంటరిగా ఉన్న చిన్నారులు, వృద్ధులపై కుక్కలు దాడి చేయడంపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కొత్త జంటలకు గవర్నర్ ఆశీస్సులు



హైదరాబాద్, అక్టోబర్ 26: నూతన జంటలు ఆదర్శవైన సమాజానికి బాటలు వేయాలని, చెంచు సామాజికవర్గం సామూహిక వివాహాలు జరిపించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ వర్మ అన్నారు. ఈరోజు అచ్చంపేట పట్టణంలో ఏసీఆర్ గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర వనవాసి కల్యాణ్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెంచు సామూహిక వివాహాలకు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ అన్నిదానాలలో కన్నా అతిపెద్ద దానం కన్యాదానం అని అన్నారు. భారతీయ సంప్రదాయంగా జరిగిన ఈ వివాహాలతో చెంచులు తమ వివాహ జీవితాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకొని సమాజానికి మెరుగైన బాటలు వేయాలని కోరారు.

చెంచులు సంఖ్యాపరంగా తక్కువ సంఖ్యలో ఉన్నా, తమ భాషా సంస్కృతి పరంగా చాలా శక్తివంతమైన వారని విద్యా, సాంకేతిక రంగాలలో ఆదివాసీలు ఉన్నత స్థాయికి ఎదగాలని, వారికి అన్ని రకాలుగా సహకారం అందిస్తామని వారు అన్నారు.

హర్యాన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ క్రమశిక్షణతో, సంప్రదాయబద్ధంగా వనవాసి నిర్వాహకులు సామూహిక వివాహాలు జరిపించడం అభినందనీయమని అన్నారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ వర్మ చెంచు నవ దంపతులను వేదమంత్రోచ్చారణతో ఆశీర్వదించారు. అంబాత్రేయ క్షేత్ర పీఠాధిపతి ఆదిత్య పరాశర స్వామిజీ నవ దంపతులకు వివాహ బంధం గురించి వివరించి వారిని ఆశీర్వదించారు.

అంతకుముందుకు కలెక్టర్ బాధావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయలకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్టు జస్టిస్ శ్రీమతి టి. మాధవివక్త గా వనవాసి కళ్యాణ ఆశ్రమం అఖిలభారత కార్యకారిణి సభ్యులు శ్రీమతి రేఖ నాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘజియాబాద్‌లోని ఇందిరాపురంలో యశోద వైద్యాన్ని ప్రారంభించిన భారత రాష్ట్రపతి

న్యూఢిల్లీ, అక్టోబర్ 26:భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈరోజు (అక్టోబర్ 26, 2025) ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లోని ఇందిరాపురంలో యశోద మెడిసిటీని ప్రారంభించారు.



ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణ దేశ నిర్మాణంలో అంతర్భాగమని అన్నారు. వ్యాధుల నుండి ప్రజలను రక్షించడం మరియు వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం ప్రభుత్వానికి ప్రాధాన్యత. ఈ ప్రయోజనం కోసం, దేశవ్యాప్తంగా ఆరోగ్య మరియు వైద్య మౌలిక సదుపాయాలు, సంస్థలు మరియు సేవలను నిరంతరం విస్తరిస్తున్నారు. అటువంటి ప్రయత్నాలన్నీ ఆరోగ్యకరమైన మరియు అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడానికి ఖచ్చితంగా దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వంతో పాటు, అన్ని ఇతర భాగస్వాములు కూడా ఈ ప్రయత్నాలలో కీలక పాత్ర పోషిస్తారు.

అందువల్ల, ఆరోగ్య సంరక్షణ సేవలను విస్తరించడం మరియు దేశంలోని అన్ని ప్రాంతాలలో నాణ్యమైన సేవలు అందుబాటులో ఉండేలా చూసుకోవడం మరియు ఏ పౌరుడు కూడా సమర్థవంతమైన ఆరోగ్య సంరక్షణను కోల్పోకుండా చూసుకోవడం అన్ని వాటాదారుల బాధ్యత. ఈ లక్ష్యాన్ని సాధించడంలో మంచి ప్రైవేట్ రంగ ఆరోగ్య సంరక్షణ సంస్థలు అమూల్యమైన సహకారాన్ని అందించగలవు. యశోద మెడిసిటీ ఆరోగ్య సంరక్షణ రంగంలో పరివర్తన కలిగించే పనిని తీసుకువస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

కోవిడ్–19 ప్రపంచ మహమ్మారి సమయంలో, యశోద హాస్పిటల్ పెద్ద సంఖ్యలో ప్రజలకు చికిత్స చేసిందని మరియు జాతీయ ః నిర్మూలన కార్యక్రమం వంటి జాతీయ ప్రాధాన్యతలను శ్రద్ధగా స్వీకరించిందని రాష్ట్రపతి సంతోషంగా గమనించారు. సికిల్ సెల్ అనీమియాకు సంబంధించిన జాతీయ ప్రచారాలకు సంస్థ తన వంతు కృషి చేయాలని ఆమె కోరారు. క్యాన్సర్ చికిత్స కోసం పరిశోధనలు చేపట్టాలని మరియు ఇతర సంస్థలతో సహకరించాలని ఆసుపత్రి వాటాదారులకు కూడా ఆమె సూచించారు.

వైద్య బాధ్యతతో పాటు సామాజిక బాధ్యతను నెరవేర్చడం ఆరోగ్య సంరక్షణ సంస్థలకు ప్రాధాన్యతగా ఉండాలని రాష్ట్రపతి అన్నారు. యశోద మెడిసిటీ 'అందరికీ సరసమైన ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలు' అనే తన లక్ష్యాన్ని సాకారం చేసుకుంటుందని ఆమె నమ్మకంగా ఉంది. ప్రైవేట్ మరియు ప్రభుత్వ రంగాలలోని అద్భుతమైన ఆరోగ్య సంరక్షణ సంస్థల మద్దతుతో, భారతదేశం ప్రపంచ ఆరోగ్య సంరక్షణ గమ్యస్థానంగా మరింత గుర్తింపు పొందుతుందని ఆమె పేర్కొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన షెడ్యూల్ ఖరారు

హైదరాబాద్, అక్టోబర్ 26: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన షెడ్యూల్ ఖరారైంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో భారీ బహిరంగ సభ, నాలుగు రోడ్డు షోలకు రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ నెల 28వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహణకు కాంగ్రెస్ హై కమాండ్ ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 30, 31వ తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు షో నిర్వహించనున్నారు. నవంబర్ 4, 5వ తేదీల్లో మరో విడత రోడ్డు షోలో పాల్గొననున్నారు సీఎం రేవంత్‌రెడ్డి.


## జీఎస్టీ మార్పులతో అన్ని వర్గాల్లో సంతోషం : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 26:దసరా, దీపావళి పండుగల వేళ జీఎస్టీ శ్లాబుల లో తీసుకొచ్చిన మార్పులు అన్ని వర్గాల్లో సంతోషాన్ని నింపాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. మన్‌కీ బాత్ 127వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. జీఎస్టీ మార్పు లవల్ల ఈ సీజన్లో దేశీయ వస్తువుల కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయన్నారు.

వంట నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించాలని రాసిన లేఖకు సానుకూల స్పందన వచ్చిందని ప్రధాని వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపుర్‌లో గార్బేజ్ కేఫ్ వినూత్నంగా పర్యావరణానికి సేవలు అందిస్తోందని తెలిపారు. అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను ఇచ్చి ఫుల్ మీల్స్ తినొచ్చు. మీరు కిలో వ్యర్థాలు ఇస్తే.. లంచ్ లేదా డిన్నర్ ఏర్పాటు చేస్తారు. అదే అరకిలో ఇస్తే అల్పాహారం ఇస్తారు. ఈ కేఫ్‌ను అంబికాపూర్ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తోందని ప్రధాని అభినందించారు.

అదేవిధంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరుపుకుంటున్న ఛాత్‌పూజ మహోత్సవం గురించి, మావోయిస్టుల గురించి కూడా ప్రధాని మోదీ మన్ కీ బాత్‌లో ప్రస్తావించారు.

## 21వ శతాబ్దం ఆసియాన్ దేశాలవే.. : ప్రధాని నరేంద్ర మోదీ




న్యూఢిల్లీ, అక్టోబర్ 26:ఆసియా దేశాలు ఉమ్మడి విలువలకు కట్టుబడి ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. ఈ ఆసియాన్ సమావేశం మలేషియాలో జరుగుతండగా.. ఆ దేశ ప్రధానికి మోదీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 21వ శతాబ్దం ఆసియాన్ దేశాలదేనన్నారు. మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం తనకు స్నేహితుడని.. ఆసియాన్ కుటుంబంలో చేరడానికి నాకు అవకాశం ఇచ్చినందుకు తనకు చాలా సంతోషంగా ఉన్నానన్నారు. సదస్సు విజయవంతంగా నిర్వహించినందుకు అన్వర్ ఇబ్రహీంకు అభినందనలు చెప్పారు. కొత్త సభ్య దేశంగా చేరిన తిమోర్ లెస్టేకు స్వాగతం పలికారు. థాయ్‌లాండ్ క్వీన్ మదర్ మరణంపై సంతాపం ప్రకటించారు. భారత్, ఆసియాన్ కేవలం భౌగోళికంగా మాత్రమే కాకుండా.. సంస్కృతి, విలువల పరంగానూ దగ్గరగా ఉన్నాయని చెప్పారు.

రెండు ప్రాంతాల మధ్య వాణిజ్య సంబంధాలు మాత్రమే కాక ఆధ్యాత్మిక, సాంస్కృతిక బంధాలు కూడా బలంగా ఉన్నాయన్నారు. ఆసియాన్ భారతదేశ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'లో కీలక స్తంభమని, ఆసియాన్ సెంట్రాలిటీని, ఇండో పసిఫిక్ దృష్టికోణాన్ని భారత్ మద్దతు ఇస్తుందని స్పష్టమైందన్నారు. ప్రపంచంలో ఏర్పడుతున్న అనిశ్చిత పరిస్థితుల్లో భారత్–ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం నిరంతరం బలపడుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ బలమైన భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వానికి, అభివృద్ధికి మూలం అవుతోందన్నారు. ఈ ఏడాది ఆసియాన్ సదస్సు థీమ్ 'ఇంక్లూజివిటీ అండ్ సస్టైనబిలిటీ'గా ఉండడం ఉమ్మడి కృషిని ప్రతిబింబిస్తున్నదని, డిజిటల్ ఇన్‌క్లూజన్, ఫుడ్ సెక్యూరిటీ, సరఫరా గొలుసు స్థిరత్వం వంటి రంగాల్లో సహకారం మరింత బలోపేతమవుతుందన్నారు. సమన్వయకర్త పాత్రను సమర్థవంతంగా నిర్వర్తించినందుకు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇంకా మాట్లాడుతూ థాయిలాండ్ రాణి తల్లి మరణంపై అన్ని భారతీయుల తరఫున, థాయిలాండ్ రాజకుటుంబం, ప్రజలకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నానన్నారు.

## మూడు సార్లు అవకాశం ఇచ్చినా అభివృద్ధి చేయని బీఆర్ఎస్



హైదరాబాద్, అక్టోబర్ 26: జూబ్లీహిల్స్ అభివృద్ధి ఒక్క కాంగ్రెస్‌కే సాధ్యమని మంత్రులు దనసరి అనసూయ (సీతక్క), జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ రోజు మధురానగర్‌లో గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఆశీర్వదించాలని ఓటర్లను మంత్రులు దనసరి అనసూయ (సీతక్క), జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి మహిళా కార్పొరేషన్ చైర్పర్సన్ బంద్రు శోభారాణి, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అభ్యర్థించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రతి గడపకు వెళ్లి ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, ప్రజల కోసం చేస్తున్న సేవలను వివరించారు.

గత మూడు సార్లు బీఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చినా అభివృద్ధి జరగలేదని ప్రజలకు గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు అవకాశం ఇవ్వాలని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యం అని సీతక్క అన్నారు.

మూడుసార్లు అవతలి పార్టీకి ఓటేస్తే ఇక్కడ ఒరిగిందేమీ లేదన్నారు.

ఇందిరా గాంధీ హయాంలోనే ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు వచ్చాయని, దీనివల్ల ఇక్కడ అనేక కాలనీలు నిర్మించారన్నారు. అభివృద్ధి అంటేనే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి అని పేర్కొన్నారు.

గత పది సంవత్సరాలుగా పేదలకు ఉద్యోగాలు రాలేదని, కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 80 వేల ప్రభుత్వ ఉద్యోగాలు, ఉచితంగా సన్నబియ్యం పంపిణీ, ఉచిత రవాణా, ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీ లేని లోన్లు, ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల విలువైన ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నామని మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళు నిర్మాణంలో ఉన్నాయన్నారు.

జూబ్లీహిల్స్‌ఉపఎన్నికల తర్వాత ఈ నియోజకవర్గంలో కూడా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. మూడుసార్లు మాగంటిని గెలిపించిన ఉపయోగం లేదన్నారు. ఈసారి గల్లీ బిడ్డ నవీన్ యాదవ్‌కు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.

రాష్ట్రంలో మన ప్రభుత్వం ఉంది, అందుకే అభివృద్ధి కాంగ్రెస్‌కు సాధ్యమని, ఇప్పటికే రూ.150 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ఇళ్లు కావాలంటే, ఉచిత విద్యుత్‌కావాలంటే, సన్న బియ్యం కావాలంటే చేతి గుర్తుకే ఓటేయండని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

నవీన్ యాదవ్‌ను ఆశీర్వదిస్తే జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి వేగవంతం అవుతుంది అని సీతక్క హామీ ఇచ్చారు.

## మొంథా తుపాన్.. అధికార యంత్రాంగం అప్రమత్తం: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 26:మొంథా తుపాన్ ప్రభావం ఆంధ్రప్రదేశ్ పై ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలతోపాటు ఉన్నతాధికారులందరూ అన్ని శాఖల సమన్వయంతో పనిచేసేలా సన్నద్ధం చేశామని చెప్పారు. జిల్లాలకు అవసరమైన నిధులు అందుబాటులో ఉంచి.. ప్రత్యేక అధికారులను నియమించామని వివరించారు.



విద్యుత్, తాగునీరు, రవాణా సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అలాగే వర్షం తీవ్రత, తుపాన్ ప్రభావానికి సంబంధించిన సమాచారాన్ని నేరుగా ప్రజలకు పంపడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. అధికార యంత్రాంగానికి, ప్రభుత్వానికి సహకరించాలని ఈ సందర్భంగా ప్రజలకు సీఎం చంద్రబాబు సూచించారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి.. అక్కడ అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా వేదికగా సీఎం చంద్రబాబు మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి మొంథా తుఫాన్‌గా మారే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ తుఫాన్ కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. ఈ తుఫాన్ ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని.. అలాగే బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. తుపాన్ కారణంగా సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లాలకు ప్రత్యేక అధికారులను ఇప్పటికే ప్రభుత్వం నియమించింది.

ఇక అక్టోబర్ 30వ తేదీ వరకు ప్రభుత్వ ఉద్యోగులు సెలవులను రద్దు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. తుపాన్ కారణంగా ఎవరికి ఎటువంటి సమస్య ఎదురైనా.. సహాయం కోసం కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని ప్రజలకు ప్రభుత్వం సూచించింది. మూడు రోజుల వరకు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని తీర ప్రాంత ప్రజలను ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు.

కార్తీక మాసం.. సముద్ర స్నానం..

కార్తీక మాసం నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో సముద్ర స్నానాలు ఆచరిస్తారు. ఈ తుపాన్ ప్రభావం కారణంగా.. సముద్రంలో అలల తీవ్రత అధికంగా ఉంటుంది. దాంతో ప్రమాదం పొంచి ఉందని.. సముద్ర స్నానాలు చేయవద్దని ప్రజలకు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

## గోపరిరక్షణను చాలా రాష్ట్రాలు ప్రోత్సహిస్తున్నాయి- కేంద్రమంత్రికిషన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 26:గోపరిరక్షణను చాలా రాష్ట్రాలు ప్రోత్సహిస్తున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పలు రాష్ట్రాలు సబ్సిడీలు అందిస్తున్నాయని ఉద్ఘాటించారు. గోమాతను కొంత మంది ద్వేషిస్తారని.. ఇది ఏమాత్రం మంచిది కాదని చెప్పుకొచ్చారు. ఓ మతానికి ముడిపెట్టి గోమాతను అవమానించడం సరికాదని తెలిపారు కిషన్‌రెడ్డి.



పట్టణ వీధుల్లో గోవులు ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయని.. వీటిని నివారించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. గోవుల సంఖ్య పెరుగుతోందని.. మనం వాటిని పరిరక్షించుకోవాలని కిషన్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని ఐఓఎంలో గోసేవ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో గో విజ్ఞాన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఇవాళ(ఆదివారం) జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

'ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ నా హృదయపూర్వక అభినందనలు. గ్రామీణ వాతావరణంలో పెరిగిన నాకు గోమాతపై ప్రత్యేకమైన గౌరవం, వాటి రక్షణపై అవగాహన ఉంది. అలాగే, గోవులతో సమాజానికి చేకూరే అపారమైన లాభాలు నాకు పూర్తిగా తెలుసు. పచ్చిక బయళ్లలో గోవులు స్వేచ్ఛగా తిరుగుతుంటే కలిగే ఆనందమే వేరు. ఆ దృశ్యం చూసి తరించిన వారికే ఆ అనుభూతి తెలుస్తోంది. గోవుల గొప్పతనం గురించి మన వేదాలు చెబుతూనే ఉన్నాయి. 'గావో విశ్వస్య మాతర:' అంటే 'ఆవులు విశ్వానికే తల్లి' అని అర్థం. ఈ సూక్తిని మనం నిజం చేసుకోవాల్సిన అవసరం ఉంది. గోవులు కేవలం పాలను మాత్రమే కాకుండా, వాటి శ్వాస, ఉచ్ఛ్వాసల మధ్య గడిపే సమయం మనిషిలోని నగం ఆరోగ్య సమస్యలను పరిష్కరిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు' అని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

'ఎప్పుడూ అధికారిక కార్యక్రమాలతో ప్రధాని మోదీ బిజీగా ఉంటారు. అయితే ప్రధాని తన నివాసంలో గోవులను పెంచుకుంటూ, వాటితో గడిపే సమయంతో మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలను దూరం చేసుకుంటున్నాన నాకు చెప్పారు. ఇది గోవుల ప్రాముఖ్యతకు ఒక మంచి ఉదాహరణ. దురదృష్టవశాత్తూ, వ్యవసాయ క్షేత్రాలు, భూకమతాలు తగ్గిపోవడంతో గోవుల స్వేచ్ఛకు ఇబ్బందులు వస్తున్నాయి. ఒకప్పుడు పచ్చిక బయళ్లలో గోవులు స్వేచ్ఛగా తిరిగేవి. ఇప్పుడు ఇరుకు స్థలంలో కట్టేస్తున్నారు. గోశాలల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వాటికి కావాల్సినంత స్వేచ్ఛ, ఆనందం లేకుండా పోయింది' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

'గోవుల రక్షణ కేవలం గో పరిరక్షకుల బాధ్యత మాత్రమే కాదని.. సమాజం మొత్తం ఆ బాధ్యత తీసుకోవాలి. గోవుల ఉత్పత్తుల ప్రాధాన్యత గురించి చాలామందికి తెలియదు. నేను స్వయంగా గోవుల నెయ్యిని ఉపయోగిస్తాను. ఆశ్చర్యకరంగా, సౌదీ అరేబియా లాంటి దేశాలు కూడా మన గోవుల ఉత్పత్తులను వాడుతున్నాయి. అంతేకాకుండా, గోవుల వ్యర్థాలతో వ్యవసాయం చేయడం ద్వారా భూమి సారాన్ని పెంచుతున్నాయి. ఈ రోజు గో సేవ విభాగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అద్భుతమైన కార్యక్రమంలో, తల్లిదండ్రులను, వారి పిల్లలను భాగస్వామ్యం చేస్తున్నందుకు సంతోషిస్తున్నాను. ఇది రాబోయే తరాలకు గో సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. మన గోమాతకు ఇంతటి ప్రాధాన్యత ఉందని.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాటిని రక్షించుకోవాలి' అని కిషన్‌రెడ్డి సూచించారు.

# ఐసీఎంఆర్, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో మహా మెడ్ టెక్ మిషన్ ను ప్రారంభించిన ఏఎన్ఆర్ఎఫ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 26:ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), గేట్స్ ఫౌండేషన్ సహకారంతో మిషన్ ఫర్ అడ్వాన్స్ మెంట్ ఇన్ హై-ఇంపాక్ట్ ఏరియాస్ (ఎంఏహెచ్ ఏ) మెడికల్ టెక్నాలజీ (మహా మెడ్ టెక్)ను అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) ప్రారంభించింది. వైద్య సాంకేతిక రంగంలో ఆవిష్కరణలను వేగవంతం చేయటానికి, దిగుమతులను తగ్గించటం, అందుబాటు ధరలో, నాణ్యమైన వైద్య సాంకేతికతలను అందరికీ సమానంగా అందేలా చూడటం ఈ మిషన్ లక్ష్యం.

విద్యా సంస్థలు, ఆర్ అండ్ డీ సంస్థలు, ఆస్పత్రులు, స్టార్టప్ లు, ఎంఎస్ఎంఈలు, మెడ్ టెక్ పరిశ్రమలు, వివిధ సంస్థల సహకారంతో విస్తృత శ్రేణి సంస్థలకు ఈ మిషన్ ఆర్థికంగా చేయూతనిస్తుంది. ప్రాధాన్యతను బట్టి ప్రతి ప్రాజెక్టుకు రూ.5 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు (అసాధారణ సందర్భాల్లో రూ.50 కోట్ల వరకు) నిధులను అందిస్తుంది. ప్రభావవంతమైన మెడ్ టెక్ పరిష్కారాలను మార్కెట్లోకి తీసుకువచ్చే ప్రాజెక్టులకు ఈ మిషన్ మద్దతిస్తుంది.

వివిధ నూతన వైద్య పరికరాలు, ఇన్-విట్రో డయాగ్నస్టిక్స్ వంటివి ఈ మిషన్ పరిధిలోకి వస్తాయి. వీటిలో ముఖ్యంగా వైద్య పరికరాలు, కీలక ఉప భాగాలు, ఇంప్లాంట్లు, సహాయ, శస్త్రచికిత్స పరికరాలు, వినియోగ వస్తువులు, సాంకేతిక వైద్య పరికరాలు ఉన్నాయి. అధునాతన రోగ నిర్ధారణ పద్ధతులు, చిన్న శస్త్రచికిత్సలు, పాయింట్ ఆఫ్ కేర్ మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్, ఏఐ, ఎంఎల్ ఆధారిత వేదికలు, రోబోటిక్స్, ఇతర నూతన సాంకేతికతలు ఈ మిషన్ పరిధిలో (మరిన్ని కొత్త అంశాలు కూడా) ఉంటాయి. క్షయ, క్యాన్సర్, నవజాత శిశు సంరక్షణ, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వంటి జాతీయ ఆరోగ్య ప్రాధాన్యత గల ప్రాజెక్టులను ఈ మిషన్ స్వాగతిస్తుంది.

నిధులతో పాటు పేటెంట్ మిత్ర (ఐపీ ప్రొటెక్షన్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్ ఫర్), మెడ్ టెక్ మిత్ర (రెగ్యులేటరీ గైడెన్స్ అండ్ క్లియరెన్సెస్), క్లినికల్ ట్రయల్ నెట్ వర్క్ (ఫర్ క్లినికల్ వాలిడేషన్ అండ్ ఎవిడెన్స్ జనరేషన్), పారిశ్రామిక నిపుణుల నుంచి సలహాలు అందించటం వంటి జాతీయ కార్యక్రమాల ద్వారా అవసరమైన సాయాన్ని ఈ మిషన్ అందిస్తుంది.

# హిందూ సమాజ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



ఆదిలాబాద్, అక్టోబర్ 26:హిందూ సమాజ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధాన వక్తలు పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మంచిర్యాల జిల్లా తాండూర్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కవాతు నిర్వహించారు. భారీ కవాతు లో స్వయంసేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కిష్టంపేట్ విద్యాభారతి హైస్కూల్ నుంచి ప్రారంభమైన కవాతు ఇరువైపుల నుంచి వచ్చిన కార్యకర్తలు మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తా శివాజీ చౌక్ వద్ద ఏకమై, అక్కడి నుంచి ప్రధాన విధుల గుండా జాతీయ రహదారి మీదుగా కొనసాగింది. ఈ కవాతులో భరతమాత, డాక్టర్ జీ, గురూజీ చిత్రపటాలతో పాటు భగవధ్వజంతో ఊరేగారు.

దారి పొడవునా స్థానికులు, మహిళలు భగవాధ్వజంపై పూలు చల్లుతూ మంగళ హారతి పట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు, గణవేషధారి , స్వయం సేవకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన వక్తలు మాట్లాడుతూ.. హిందూ సమాజాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గ్రామగ్రామాన స్వయం సేవక్ సంఘ్ విస్తరించాలని, దేశాభివృద్ధే లక్ష్యంగా పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ ప్రజలలో దేశభక్తి పెంపొందిస్తూ సంఘటితంగా ఉండడానికి, స్ఫూర్తిని నింపుతూ కవాతు నిర్వహించిందన్నారు.

# వివాహేతర సంబంధం కారణంగా.. వ్యక్తిని కట్టేసి కొట్టి చంపారు

బెంగళూరు, అక్టోబర్ 26: ఒక వ్యక్తికి మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. కొంతకాలం కలిసి జీవించిన ఆమె తన పుట్టింటికి వెళ్లింది. అక్కడకు వెళ్లిన ప్రియుడ్ని ఆ మహిళ కుటుంబ సభ్యులు కట్టేసి కొట్టి చంపారు.కర్ణాటకలోని బీదర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా గౌనగావ్ గ్రామానికి చెందిన 27 ఏళ్ల విష్ణు తన తల్లితో కలిసి బీదర్‌లోని చింతకి గ్రామంలో నివసిస్తున్నాడు. పెళ్లై, పిల్లలున్న పూజతో అతడికి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో భర్తను వీడిన ఆమె విష్ణుతో కలిసి కొంతకాలం జీవించింది.

కాగా, మూడు నెలల కిందట పూజ నాగనపల్లిలోని తన తల్లిదండ్రుల ఇంటికి తిరిగి వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆమెను కలిసేందుకు విష్ణు మరో ఇద్దరితో కలిసి అక్టోబర్ 21న ఆ గ్రామానికి చేరుకున్నాడు.

అక్కడ హనుమాన్ ఆలయంలో ఉండగా పూజ తండ్రి అశోక్, ఆమె సోదరుడు గజానన్ కలిసి విష్ణును అడ్డుకున్నారు. అతడ్ని గుడి నుంచి బయటకు లాక్కొచ్చి ఒక స్తంభానికి కట్టారు. ఆ తర్వాత కర్రలతో దారుణంగా కొట్టారు.

మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు.

తీవ్రంగా గాయపడిన విష్ణును తొలుత చింతకి ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తర్వాత బీదర్‌లోని బ్రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అతడు మరణించాడు.

విష్ణు తల్లి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులైన పూజ తండ్రి అశోక్, ఆమె సోదరుడు గజాననన్ను అరెస్ట్ చేశారు.

అయితే వారిద్దరూ విష్ణును కర్రలతో దారుణంగా కొట్టిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# 22 భాషలు డిజిటల్‌గా పునర్నిర్మించబడ్డాయి

న్యూఢిల్లీ, అక్టోబర్ 26:భారతదేశం యొక్క భాషా ప్రకృతి దృశ్యం ప్రపంచంలోనే అత్యంత వైవిధ్యమైనది, 22 షెడ్యూల్డ్ భాషలు మరియు దాని విస్తారమైన భౌగోళికంలో వందలాది గిరిజన మరియు ప్రాంతీయ మాండలికాలు మాట్లాడబడుతున్నాయి. డిజిటల్ పరివర్తన వేగవంతం అవుతున్న కొద్దీ, ఈ భాషా వైవిధ్యాన్ని డిజిటల్ మౌలిక సదుపాయాలలో పొందుపరచాల్సిన అవసరం చాలా కీలకంగా మారింది. సాంకేతికత ఇకపై కేవలం కమ్యూనికేషన్ మాధ్యమం కాదు; ఇది చేరికకు వెన్నెముక.

తెలివైన, స్కేలబుల్ భాషా పరిష్కారాలను నిర్మించడానికి భారత ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ (ఎన్ఎల్పీ), మెషిన్ లెర్నింగ్ మరియు స్పీచ్ రికగ్నిషన్ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తోంది. ఈ చొరవలు సజావుగా కమ్యూనికేషన్, రియల్-టైమ్ అనువాదం, వాయిస్-ఎనేబుల్డ్ ఇంటర్‌ఫేస్‌లు మరియు స్థానికీకరించిన కంటెంట్ డెలివరీని ప్రారంభించడం ద్వారా డిజిటల్ సేవలకు ప్రాప్యతను ప్రజాస్వామ్యీకరించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. భాషా వైవిధ్యాన్ని గౌరవించే బలమైన సాంకేతిక పర్యావరణ వ్యవస్థను నిర్మించడం ద్వారా, భారతదేశం ఒక సమగ్ర డిజిటల్ భవిష్యత్తుకు పునాది వేస్తోంది, ఇక్కడ ప్రతి పౌరుడు, వారి మాతృభాషతో సంబంధం లేకుండా, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ మరియు పాలనలో పూర్తిగా పాల్గొనవచ్చు.

భాషాపరమైన చేరికను నడిపించే కీలక వేదికలు

ఏఐ-ఆధారిత భాషా వేదికలు మరియు విస్తారమైన డిజిటల్ రిపోజిటరీలు భారతదేశ భాషలు ఎలా సంరక్షించబడుతున్నాయి, ఉపయోగించబడుతున్నాయి మరియు అభివృద్ధి చెందాయి అనే దాని గురించి తిరిగి ఊహించుకుంటున్నాయి. భాషిణి మరియు భారత్‌జెన్ వంటి వేదికలు పాలన, ఆరోగ్య సంరక్షణ మరియు విద్య అంతటా బహుభాషా మద్దతును అందిస్తున్నాయి. ఆది-వాణి వంటి చొరవలు గిరిజన భాషలను డిజిటల్ వర్గంలోకి తీసుకువస్తాయి. ఈ ఏకీకరణ భారతదేశ భాషా వారసత్వం సంరక్షించబడటమే కాకుండా డిజిటల్ యుగంలో క్రియాత్మకంగా మరియు డైనమిక్‌గా మారిందని నిర్ధారిస్తుంది.

గత దశాబ్దంలో, కృత్రిమ మేధస్సు, సహజ భాషా ప్రాసెసింగ్ మరియు డిజిటల్ మౌలిక సదుపాయాలలో పురోగతి భారతదేశ భాషా వైవిధ్యాన్ని డాక్యుమెంట్ చేయడానికి, డిజిటలైజ్ చేయడానికి మరియు పునరుజ్జీవింపజేయడానికి ప్రయత్నాలను వేగవంతం చేసింది. ఈ సాంకేతికతలు వందలాది భాషలు మరియు మాండలికాలలో పెద్ద ఎత్తున భాషా డేటా సేకరణ, ఆటోమేటెడ్ అనువాదం మరియు ప్రసంగ గుర్తింపును ప్రారంభించాయి, వీటిలో చాలా వరకు గతంలో తక్కువగా సేవలు అందించబడ్డాయి. ఈ సాంకేతిక వేగం కమ్యూనికేషన్ అంతరాలను తగ్గించడానికి, సమ్మిళిత పాలనను ప్రోత్సహించడానికి మరియు వారి స్థానిక భాషలలో డిజిటల్ కంటెంట్‌ను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా కమ్యూనిటీలను శక్తివంతం చేయడానికి సహాయపడింది.

2024లో స్థాపించబడిన ఆది-వాణి, గిరిజన భాషల నిజ-సమయ అనువాదం మరియు సంరక్షణకు అంకితమైన భారతదేశంలో మొట్టమొదటి ఏఐ-ఆధారిత వేదిక. అత్యాధునిక భాషా సాంకేతికతల ద్వారా కమ్యూనికేషన్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి రూపొందించబడిన ఆది-వాణి, కృత్రిమ మేధస్సు యొక్క ఖచ్చితత్వాన్ని మానవ భాషా నైపుణ్యంతో కలిపి సజావుగా బహుభాషా అనుభవాలను అందిస్తుంది.

దాని ప్రధాన భాగంలో, ఆది-వాణి సంతాలి, భిలి, ముండారి మరియు గోండి వంటి భాషలకు మద్దతు ఇవ్వడానికి అధునాతన ప్రసంగ గుర్తింపు మరియు సహజ భాషా ప్రాసెసింగ్ ను ఉపయోగిస్తుందివీటిలో చాలా వరకు సాంప్రదాయకంగా మౌఖిక ప్రసారంపై ఆధారపడి ఉన్నాయి మరియు తగినంత డిజిటల్ ప్రాతినిధ్యం లేదు. గిరిజన భాషలు మరియు ప్రధాన భారతీయ భాషల మధ్య నిజ-సమయ అనువాదాన్ని ప్రారంభించడం ద్వారా, వేదిక ఈ గొప్ప భాషా సంప్రదాయాలను సంరక్షించడమే కాకుండా విద్య, పాలన మరియు సాంస్కృతిక డాక్యుమెంటేషన్ కోసం వాటిని అందుబాటులో ఉంచుతుంది.

అంతరించిపోతున్న భాషల రక్షణ మరియు సంరక్షణ పథకం

2013లో విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించి, మైసూరులోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (ఏఐఏ) అమలు చేసిన అంతరించిపోతున్న భాషల రక్షణ మరియు సంరక్షణ పథకం , అంతరించిపోతున్న భారతీయ భాషలను - ముఖ్యంగా 10,000 కంటే తక్కువ మంది మాట్లాడే భాషలను - డాక్యుమెంట్ చేయడం మరియు డిజిటల్‌గా ఆర్కైవ్ చేయడంపై దృష్టి పెడుతుంది.

ఇది సంరక్షణ మరియు ఆవిష్కరణ రెండింటికీ ఉపయోగపడే రిచ్ టెక్స్ట్, ఆడియో మరియు వీడియో డేటాసెట్‌లను ఉత్పత్తి చేస్తుంది, ఏఐ మరియు నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ వ్యవస్థలకు కీలకమైన వనరులను అందిస్తుంది. ఏఐఏ యొక్క డిజిటల్ రిపోజిటరీ అయిన సాంచిక వంటి ప్లాట్‌ఫామ్‌లు ఏఐ మోడల్ శిక్షణ, యంత్ర అనువాదం మరియు సాంస్కృతికంగా పాతుకుపోయిన భాషా సాంకేతికతల అభివృద్ధికి మద్దతు ఇస్తాయి.

సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ ద్వారా నిర్వహించబడే సాంచిక, షెడ్యూల్డ్ మరియు గిరిజన భాషల కోసం నిఘంటువులు, ప్రైమర్‌లు, స్టోరీబుక్‌లు మరియు మల్టీమీడియా వనరులను సమీకరిస్తుంది. ఈ కేంద్రీకృత డిజిటల్ ఆర్కైవ్ భాషా నమూనాలకు శిక్షణ ఇవ్వడం, అనువాద వ్యవస్థలను అభివృద్ధి చేయడం మరియు సాంస్కృతిక కథనాలను సంరక్షించడం కోసం ఒక ముఖ్యమైన డేటా మూలం

# నక్సలిజానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ సమగ్ర వ్యూహం

న్యూఢిల్లీ, అక్టోబర్ 26:భద్రత, అభివృద్ధి మరియు పునరావాసం కలిపిన సమగ్ర విధానం ద్వారా కేంద్ర ప్రభుత్వం భారతదేశ నక్సల్ వ్యతిరేక వ్యూహాన్ని మార్చింది. గతంలోని విచ్ఛిన్నమైన ప్రతిస్పందనలను వదిలివేసి, మార్చి 2026 నాటికి అన్ని ప్రభావిత జిల్లాలను నక్సల్ రహితంగా మార్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం సంభాషణ, భద్రత మరియు సమన్వయంలో పాతుకుపోయిన ఏకీకృత ప్రణాళికను స్వీకరించింది.

ఈ విధానం చట్ట అమలు సామర్థ్యం, సామర్థ్య నిర్మాణం మరియు సామాజిక ఏకీకరణపై సమానంగా దృష్టి పెడుతుంది, ఇది రియాక్టివ్ కంటైన్‌మెంట్ నుండి చురుకైన నిర్మూలనకు ఒక నమూనా మార్పును సూచిస్తుంది.

### నక్సల్ హింసలో తగ్గుదల దశాబ్దం

గత దశాబ్దంలో, భద్రతా దళాల సమన్వయ ప్రయత్నాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలు నక్సల్ సంబంధిత హింసలో గణనీయమైన తగ్గుదలకు దారితీశాయి. 2004 -2014 మరియు 2014-2024 మధ్య, హింసాత్మక సంఘటనలు 16,463 నుండి 7,744కి తగ్గాయి, భద్రతా సిబ్బంది మరణాలు 1,851 నుండి 509కి తగ్గాయి మరియు పౌర మరణాలు 4,766 నుండి 1,495కి తగ్గాయి, ఇది ప్రభావిత ప్రాంతాలలో శాంతి మరియు పాలన పునరుద్ధరించబడటానికి ఒక అద్భుతమైన సంకేతం.

2025లోనే భద్రతా దళాలు 270 మంది నక్సల్స్‌ను మట్టుబెట్టాయి, 680 మందిని అరెస్టు చేశాయి మరియు 1,225 మంది లొంగుబాటుకు దోహదపడ్డాయి.

ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ మరియు బీజాపూర్, ఛత్తీస్‌గఢ్ మరియు మహారాష్ట్రలలో సామూహిక లొంగుబాటు వంటి ప్రధాన కార్యక లాపాలు తిరుగుబాటుదారులలో ప్రధాన స్రవంతి జీవితంలో తిరిగి చేరడానికి పెరుగుతున్న విశ్వాసాన్ని నొక్కి చెబుతున్నాయి.

భద్రతా మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం కీలకమైనది. గత దశాబ్దంలో, 576 బలవర్థకమైన పోలీస్ స్టేషన్లు నిర్మించబడ్డాయి మరియు గత ఆరు సంవత్సరాలలో 336 కొత్త భద్రతా శిబిరాలు స్థాపించబడ్డాయి. నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 2014లో 126 నుండి 2024లో 18కి తగ్గింది, ఇప్పుడు 6 జిల్లాలు మాత్రమే ఎక్కువగా ప్రభావితమైనవిగా వర్గీకరించబడ్డాయి. నైట్-ల్యాండింగ్ హెలిప్యాడ్‌ల విస్తరణ (68 నిర్మించబడింది) కార్యకలాపాల సమయంలో చలనశీలత మరియు ప్రతిస్పందన సమయాలను మెరుగుపరిచింది.

నక్సల్ కార్యకలాపాలను ఖచ్చితంగా పర్యవేక్షించడానికి మరియు విశ్లేషించడానికి భద్రతా సంస్థలు ఇప్పుడు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాయి. నక్సల్ కదలికలను నిశితంగా పరిశీలించడానికి లొకేషన్ ట్రాకింగ్, మొబైల్ డేటా విశ్లేషణ, శాస్త్రీయ కాల్ లాగ్ పరీక్ష మరియు సోషల్ మీడియా విశ్లేషణ వంటి సాధనాలను ఉపయోగిస్తున్నారు. వివిధ ఫోరెన్సిక్ మరియు సాంకేతిక సంస్థల మద్దతు నిఘా సేకరణను మరింత బలోపేతం చేసింది మరియు కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరిచింది. అదనంగా, డ్రోన్ నిఘా, ఉపగ్రహ ఇమేజింగ్ మరియు ఏఐ- ఆధారిత డేటా విశ్లేషణలను పర్యవేక్షణ మరియు వ్యూహాత్మక ప్రణాళికను మెరుగుపరచడానికి సమర్థవంతంగా ఉపయోగిస్తున్నారు.

### నక్సల్ ఫైనాన్స్ నెట్‌వర్క్‌లను నిర్వీర్యం చేయడానికి వ్యూహాలు

నక్సలిజాన్ని నిలబెట్టే ఆర్థిక నెట్‌వర్క్‌లను క్రమపద్ధతిలో విచ్ఛిన్నం చేశారు. జాతీయ దర్యాప్తు సంస్థ లోని ఒక ప్రత్యేక విభాగం 40 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకోగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యకలాపాలు 12 కోట్ల విలువైన జప్తులకు దారితీశాయి. రాష్ట్రాలు 40 కోట్ల విలువైన ఆస్తులను కూడా స్వాధీనం చేసుకున్నాయి. అదనంగా, పట్టణ నక్సల్స్ గణనీయమైన నైతిక మరియు మానసిక ఎదురుదెబ్బలను చవిచూశాయి, ఇది సమాచార యుద్ధం కోసం వారి సామర్థ్యంలో తగ్గుదలకు దారితీసింది.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు : కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్, అక్టోబర్ 26: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం మెదక్ మండలం రాజ్ పల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని 33 /11 సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, సబ్ స్టేషన్ లో పలు రికార్డులను పరిశీలించారు.

ధాన్యం సేకరణ తీరును, మాశ్చరైజేషన్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఏ విధంగా సరఫరా అవుతుందో ఎన్ని గంటలు రైతులకు అందిస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లా వ్యాప్తంగా 498 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కేంద్రాల దగ్గర రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారని అందులో మాయిచ్చరైజేషన్ అయిన ధాన్యానికి టోకెన్ అందిస్తున్నామని తెలిపారు.

టోకెన్ అందించడంతోపాటు మిల్లులకు కూడా ట్యాగింగ్ ఇచ్చేస్తున్నామన్నారు. ధాన్యం సరఫరాకు వాహనాలన్నీ సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

ధాన్యం కొనుగోలు బిల్లులు త్వరగా చెల్లించేందుకు కూడా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని వెల్లడించారు. నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్ రైతులకు అందాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దేశంలో ఏకంగా 22 ఫేక్ యూనివర్సిటీలు.. హెచ్చరించిన యూజీసీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: దేశంలో మొత్తం 22 ఫేక్ యూనివర్సిటీలు ఉన్నాయని 'యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ హెచ్చరించింది. ఢిల్లీలోని కోట్లా ముబారక్‌పూర్‌లోగల ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్ సంస్థ విషయంలో యూజీసీ మరోసారి హెచ్చరికలు చేసింది.

ఆ యూనివర్సిటీ అనుమతులు లేని డిగ్రీ కోర్సులను నిర్వహిస్తోందని పేర్కొంది. ఆ సంస్థ జారీచేసే డిగ్రీలకు ఎలాంటి విలువ లేదని తెలిపింది. అసలు ఈ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఏ చట్టాలకు లోబడి ప్రారంభించలేదని యూజీసీ స్పష్టం చేసింది.

యూజీసీ డేటా ప్రకారం దేశంలో 22 గుర్తింపులేని యూనివర్సిటీలను నిర్వహిస్తున్నారని తేలింది.

వీటిల్లో 9 దేశ రాజధాని ఢిల్లీలో ఉన్నాయి. వాటిలో ఐదు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉండగా.. మిగిలినవి కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరిల్లో నిర్వహిస్తున్నట్లు యూజీసీ గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీలోని విద్యార్థులను మాయచేసి ఈ విశ్వవిద్యాలయాలు ఆకర్షిస్తున్నాయి.

తమ సంస్థలకు పేర్లు పెట్టే సమయంలో 'నేషనల్', టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇన్స్టిట్యూట్ వంటి పదాలు వాడుతున్నారు. ఇక యూపీలో విద్యాపథ్, పరిషద్, ఓపెన్ యూనివర్సిటీ లాంటి పదాలను వినియోగిస్తున్నారు.

విద్యార్థులు ఏదైనా సంస్థలో చేరే సమయంలో దాని పేరు సెక్షన్ 2 (ఎఫ్) లేదా 3 కింద యూజీసీ గుర్తించిన జాబితాలో ఉందో లేదో చెక్ చేసుకోవాలి.

ఇక ఏఐసీటీఈ, పీసీఐ, ఎన్ఎంసీ వంటి కౌన్సిల్స్ నుంచి ఆయా సంస్థల్లో ఏ కోర్సుల నిర్వహణకు అనుమతులు లభించాయో సరిచూసుకోవాలి.




# భారత్‌కే దిక్సూచిగా తెలంగాణ : కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 26: భారత్‌కే ఈ రోజు తెలంగాణ ఓ దిక్సూచిగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం జహీరాబాద్ మెడికల్ విద్యార్థులతో నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పూర్వ మెదక్ జిల్లాను రాష్ట్రంలో వైద్య ఆరోగ్యరంగాన్ని అద్భుతంగా ముందుకు తీసుకెళ్లారన్నారు. నిజంగా అమ్మాయిలు మాట్లాడుతుంటే వాళ్ల తల్లిదండ్రుల కన్నుల్లో నీళ్ళు తిరుగుతున్నాయని.. పిల్లలు ప్రయోజకులైనప్పుడు తల్లిదండ్రులు చాలా సంతోషిస్తారన్నారు. అంతకు మించిన ఆనందం తల్లిదండ్రులకు ఉండదని.. అందులో కేసీఆర్ పాత్ర ఉన్నందుకు మేము ఎంతో సంతోష పడుతున్నామన్నారు.

ఒక జహీరాబాద్ నుండి 16 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించారని.. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, సైంటిస్టులు అవుతున్నారన్నారు. తెలంగాణ అనేది ధాన్యం ఉత్పత్తిలోనే నెంబర్ వన్ కాదు.. డాక్టర్ల ఉత్పత్తిలో కూడా నెంబర్ వన్‌గా నిలుస్తుందన్నారు. ఆ ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మైనార్టీ గురుకుల ఏర్పాటు చేసేటప్పుడు కేసీఆర్ అన్నారని.. 100 గురుకులాలు ఏర్పాటు చేస్తున్నామని.. మైనార్టీలకు, మైనార్టీ అమ్మాయిలు చదువుకోరు అనరని.. కేసీఆర్ ఎప్పుడూ ఏ తల్లి తండ్రి అయిన ఆడపిల్లని చదివించడానికి కులమతాలని చూడరన్నారు. మంచిది వసతులు కల్పిస్తే చదివిస్తారని అన్నారు. 24 మైనార్టీ గురుకుల పాఠశాలలను కేసీఆర్ కేసీఆర్ నిర్మించారని.. అందులో 100 మైనార్టీ గురుకులాలను ఆడబిడ్డల కోసం నిర్మించారన్నారు.



రైతు కుమార్తె, జర్నలిస్టు కుమార్తె, ఆటో డ్రైవర్ కుమార్తె ఎంబీబీఎస్ సీట్లు సాధించడం గర్వకారణమన్నారు. ఇక్కడ ఎంబీబీఎస్ సీటు చదివించిన మీ అందరితో నా విన్నపమని.. ఒక దీపంతో మరో దీపాన్ని వెలిగించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు సహాయం చేయాలని.. వారు కూడా ఉన్నత స్థాయికి వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. గవర్నమెంట్, మీ తల్లిదండ్రులే ఈ స్థాయికి తెచ్చిందని.. కేసీఆర్ నాయకత్వంలో హరీశ్‌రావు నాలుగు మెడికల్ కాలేజ్‌లను 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలుగా పెంచారని.. ఈరోజు తెలంగాణ భారతదేశానికి ఒక దిక్సూచిగా మారిందన్నారు. రాజకీయాల్లోకి వెళ్లిపోవటం సహజమని.. మనం చేసిన మంచి పని వల్ల ఎవరికైనా మంచి జరుగుతే ఆ సంతోష చాలా గొప్పగా ఉంటుందన్నారు. విద్యార్థులంతా తల్లిదండ్రుల పేర్లు, తెలంగాణ రాష్ట్రం పేరును నిలబెట్టాలని పిలుపునిచ్చారు కేటీఆర్.

# ఏజెన్సీ బడుల్లో విద్యార్థుల వరుస మరణాలు ఆందోళనకరం : వైఎస్ షర్మిల

అమరావతి, అక్టోబర్ 26:ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాలోఉన్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల వరుస మరణాలు ఆందోళనకరమని ఏపీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఈ మేరకు ట్విటర్‌లో చంద్రబాబుప్రభుత్వం మొద్దు నిద్రే కారణమని ఆరోపించారు. కురుపాం ఘటన తర్వాతైనా ప్రభుత్వం నిద్రమత్తు వీడకపోవడం సిగ్గుచేటని, ముక్కు పచ్చలారని బిడ్డలను అన్యాయంగా పొట్టన పెట్టుకుంటున్నారని విమర్శించారు.

మన్యం జిల్లా హడ్డుబంగి పాంశాల విద్యార్థిని మృతి కూటమి ప్రభుత్వం చేసిన వరుస హత్యనేనని ఆరోపించారు. బిడ్డ బంగారు భవిష్యత్ ను చిదిమేశారని, గురుకు లాల్లో పిల్లల జీవితాలను గాల్లో దీపాలుగా మార్చారని దుయ్యబట్టారు. చంద్రబాబు 16 నెలల పాలనలో 21 మంది బిడ్డలు చనిపోయారంటే వారి మృత దేహాలపై పాలన సాగుతున్నట్లు లెక్క అని పేర్కొన్నారు. వరుస మర ణాలు కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. గిరిజన సంక్షేమంపై కూటమి ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి అద్దం పడుతుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గిరిజన సంక్షేమం అంతా బూటకమని, పేరు గొప్ప.. ఊరు దిబ్బలా ఉందని కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న 840 సంక్షేమ హాస్టళ్లు, స్కూళ్లు సమస్యలకు కేంద్రాలుగా మారాయని అన్నారు. తాగేందుకు గుక్కెడు నీళ్లు కరువు. ఆర్‌వో ప్లాంట్లు పనిచేసిన దాఖలాలు లేవని అన్నారు.

గిరిజన విద్యార్థుల వరుస మరణాలపై కూటమి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# అందరిలాగాపైకి రావాలి.. మేలు జరగాలి




హైదరాబాద్, అక్టోబర్ 26:అందరిలాగా పైకి రావాలి.. మేలు జరగాలని మీరు కోరుకుంటున్నారని వడ్డెర కులస్తులను ఉద్దేశించి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్‌ది ఇంట్లో ఈగల మోతా.. బయట పల్లకిల మోతా అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పంపకాల్లో తేడా వచ్చి మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకుంటున్నారని అన్నారు. మొన్న కొండా సురేఖ బిడ్డ, నిన్న జూపల్లి కృష్ణారావు ఎలా మాట్లాడారో చూశారు కదా అని తెలిపారు. క్యాబినెట్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి, మంత్రులు బట్టలూడదీసుకొని తిట్టుకున్నారట అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజల గురించి చూడటం లేదని.. వాళ్లు తన్నుకోడానికి, వాటాలు పంచుకోవడానికి సరిపోతుందని విమర్శించారు. మళ్లా కేసీఆర్ వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు.

తెలంగాణ భవన్ లో వడ్డెర సంఘం సమావేశానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరిలాగా పైకి రావాలి.. మేలు జరగాలని మీరు కోరుకుంటున్నారని వడ్డెర కులస్తులను ఉద్దేశించి అన్నారు. నిజానికి కేసీఆర్ ప్రభుత్వం వడ్డెర సమాజానికి సహాయం చేసిందని తెలిపారు. సిద్ధిపేటలో ట్రాక్టర్లు అందించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొరం కొట్టుకునే తమపై అక్రమ కేసులు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని వడ్డెర సోదరుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కేసీఆర్ ఉన్నప్పుడు హైదరాబాద్‌లో బిల్డింగులు నిర్మించేవాళ్లకు, మీకు చేతినిండా కూడా పని దొరికేదని అన్నారు.

కేసీఆర్ హైదరాబాద్‌లో లక్ష డబల్ బెడ్ రూమ్ ఇల్లులు కట్టిండని హరీశ్‌రావు అన్నారు. రేవంత్ రెడ్డి లక్ష ఇండ్లను కూలగొట్టిండని పేర్కొన్నారు. పేదల ఇండ్లు కూల్చొద్దంటే, హైడ్రా బందు కావాలంటే కాంగ్రెస్ ను ఓడకొట్టాలే అని విమర్శించారు. హైదరాబాద్‌లో ఇల్లులు కూలగొట్టినా ప్రజలు నాకే ఓటేస్రని రేవంత్ రెడ్డి విర్రవీగుతాడని చెప్పారు.

ఎన్నికల ముంగట మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని గ్యారెంటీ కార్డు ఇచ్చారని హరీశ్‌రావు అన్నారు. రెండువేల పెన్షన్ రూ.4000 చేస్తామన్నారని.. చేశారా కాంగ్రెస్ వాళ్లు అని ప్రశ్నించారు. 200 ఉన్న పెన్షన్ కేసీఆర్ 2000 చేసిండని చెప్పారు. 4000 పెన్షన్ ఇవ్వకపోయినా మహిళలకు 2500 ఈయకపోయినా నాకే ఓటేశారు అని రేవంత్ రెడ్డి అంటాడని తెలిపారు. మహిళలకు 2500 రావాలన్నా, వృద్ధులకు 4000 పెన్షన్ రావాలన్నా జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. ఓటుతో రేవంత్ రెడ్డి చెంపలు వాయించి బుద్ధి చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి డబ్బు మూటలను, గుండాలను నమ్ముకున్నారని తెలిపారు.

# బీసీలను అవమానిస్తున్న వారికి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

## – 15 బీసీ సంఘాల ఫైర్

హైదరాబాద్ అక్టోబర్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇంకోసారి బీసీలను రౌడీలు అంటే అగ్రకుల నాయకులకు బుద్ధి చెబుతాం అని బిఆర్ఎస్ పై 15 బీసీ సంఘాలు హెచ్చరించాయి తెలంగాణ రాష్ట్రంలో బీసీలను అవమానించడం టిఆర్ఎస్ పార్టీ అలవాటుగా చేసుకుందని ఇందుకు రౌడీ కి టికెట్ కేటాయించిందని వారు అనడాన్ని బీసీ సంఘాలుగా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన అన్నారు రాజకీయ నిరుద్యోగి ఉన్న కేసీఆర్ కు తెలంగాణ భావజాల ఉ



నాటి ప్రొఫెసర్ జయశంకర్ నుండి మొదలుకుంటే నేటి నవీన్ యాదవ్ వరకు టిఆర్ఎస్ పార్టీ అహంకారం ఆధిపత్యంతో అవమానిస్తున్నది బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ టీఆర్ఎస్ పార్టీపై ఫైర్ అయ్యారు నేడు హైదరాబాదులోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో 15 బీసీ సంఘాల నేతలు మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఉన్నత విద్యావంతుడు బిసి సామాజిక వర్గానికి చెందిన నవీన్ యాదవ్ ను బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్,ఆ పార్టీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిలు కాంగ్రెస్ పార్టీ ఒక దౌర్జన్యానికి పాల్పడిన మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ వాళ్ల దృష్టిలో మంచోడు, పేద ప్రజలకు అండగా నిలబడి అందరి కష్టసుఖాల్లో ఒకరిగా జీవించి తమ వృత్తిని నమ్ముకుని దృమాన్ని అందించిన ప్రొఫెసర్ జయశంకర్ తన సొంత ఇంటి నే టిఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి కేటాయించిన కొండ లక్ష్మణ్ బాపూజీ, కెసిఆర్ కు రాజకీయంగా అండదండలు అందించిన టైగర్ నరేంద్ర, దేశిని చిన్న మల్లయ్య నుండి ఈటల రాజేందర్ వరకు వారిని ఉపయోగించుకుని తర్వాత అవమానకరమైన రీతిలో వ్యవహరించిన పార్టీ టిఆర్ఎస్ అని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు భూ కబ్జాలకు పాల్పడి సెటిల్మెంట్లకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచి అనేకమంది బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ల పై అక్రమ కేసులు బనాయించి అందరి జీవితాలతో ఆటలాడుకునీ ఇద్దరు భార్యలతో రోడ్డుకెక్కి, టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలోని తన్నుకొని నిజాయితీగా జీవించిన బీసీ బిడ్డలైన చిన్న శ్రీశైలం యాదవ్, ఆయన కుమారుడు నవీన్ యాదవులను మాత్రం టిఆర్ఎస్ నేత కేసిఆర్ రౌడీ షీట్ లుగా పేర్కొనడం తెలంగాణ రాష్ట్రంలోని రెండున్నర కోట్ల మంది బీసీలను అవమానించడమేనని, బీసీల ఆత్మ గౌరవాన్ని కించపరుస్తూ దొరతనంతో కెసిఆర్ వ్యవహరిస్తున్నారని శ్రీనివాస్ గౌడ్, మండిపడ్డారు బీసీలపై కేసీఆర్ కు చిత్త శుద్ధి ఉంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీసీలకు ఎందుకు టికెట్ ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు తమకున్న బీసీ వ్యతిరేక భావనతో అనేక కుట్రలు కుతంత్రాలకు పాల్పడుతూ బీసీలను బట్ట కాల్చి మీద వేసే కార్యక్రమం చేస్తూ బీసీలను రాజకీయంగా ఎదగనీయకుండా బీసీలు అసెంబ్లీలో అడుగుపెట్టకుండా కుట్ర చేస్తున్నారని బీసీలంతా ఏకమై వారి కుట్రలను ఎండగట్టి ఓటు అనే ఆయుధం ద్వారా టిఆర్ఎస్ పార్టీకి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలలో బుద్ధి చెప్పాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు దొంగే,దొంగ, దొంగ.. అని అరిచినట్టు అగ్రకులాలలో ఉన్న అసలైన రౌడీలు గుండాలు భూకబ్జాదారులు నేరస్తులు గురివింద గింజలగా బీసీలను రౌడీషీటర్లుగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు, బీసీలపై టిఆర్ఎస్ పార్టీ అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోకపోతే బీసీలే ఏకమై బిఆర్ఎస్ కు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో గోరి కట్టనున్నారని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ ఏ కులాల అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం బాగయ్య, బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు కేపీ మురళీకృష్ణ, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి సాగర్, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధీటి మల్లయ్య, విశ్వబ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షులు కవుల జగన్నాథం, గంగిరెద్దుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ, సమత యాదవ్, లచ్చయ్య గౌడ్, గూడూరు భాస్కర్ మేరు, నరసింహ చారి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్‌లో డెంగ్యూ విజృంభన.. 3,300 దాటిన కేసులు

మణిపూర్, అక్టోబర్ 26: మణిపూర్‌లో డెంగ్యూ విజృంభిస్తున్నది. అక్టోబర్ 25 నాటికి ఆ రాష్ట్రవ్యాప్తంగా 3,334 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇంఫాల్ వెస్ట్‌లో అత్యధికంగా 2,323 కేసులు వెలుగులోకి వచ్చాయి. ఇంఫాల్ తూర్పులో మొత్తం 608 కేసులు నమోదయ్యాయి. మణిపూర్‌లో గత 24 గంటల్లో 69 కొత్త కేసులు నమోదైనట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య సేవల డైరెక్టరేట్ తెలిపింది. ఇంఫాల్ వెస్ట్‌లో కొత్తగా 38 కేసులు, ఇంఫాల్ తూర్పులో 21 కొత్త కేసులను గుర్తించినట్లు పేర్కొంది.

కాగా, మణిపూర్‌లోని అన్ని జిల్లాల్లో డెంగ్యూ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. బిష్ణుపూర్‌లో 96, తౌబాల్‌లో 74, సేనాపతిలో 61, కాక్చింగ్ జిల్లాలో 45 డెంగ్యూ కేసులు నమోదైనట్లు చెప్పారు. ఉఖ్రుల్, చందేల్, తమెంగ్‌లాంగ్, టెంగ్నౌపాల్, కామ్‌జోంగ్, నోనీ, కాంగ్‌పోక్‌పి, చురచంద్‌పూర్ జిల్లాల్లో 50 కంటే తక్కువ కేసులు ఉన్నాయన్నారు.

మరోవైపు జిరిబామ్, ఫెర్జావల్‌లో ఎలాంటి డెంగ్యూ కేసులు నమోదు కాలేదని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. బిష్ణుపూర్ జిల్లాలో డెంగ్యూ వల్ల ఒకరు మరణించినట్లు వెల్లడించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు వివరించారు.

# రోడ్డు పక్కనున్న ఆటోలో మహిళ మృతదేహం.. గుర్తించిన స్థానికులు

బెంగళూరు, అక్టోబర్ 26: రోడ్డు పక్కన పార్క్ చేసిన ఆటోలో మహిళ మృతదేహం కనిపించింది. ఎవరో ఆమెను హత్య చేసి మృతదేహాన్ని ఆటోలో వదిలి వెళ్లారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆ మహిళ హత్యపై దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. శనివారం తిలక్‌నగర్‌లోని ప్రధాన రహదారిపై నిలిచి ఉన్న ఆటోలో మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కాగా, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఆ మహిళను 35 ఏళ్ల సల్మాగా గుర్తించారు. పెళ్లై నలుగురు పిల్లలున్న ఆమె భర్త ఇటీవల మరణించినట్లు తెలుసుకున్నారు. తెలిసిన వ్యక్తి ఎవరో సల్మా తలపై కొట్టి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆ తర్వాత మృతదేహాన్ని దుప్పట్లో చుట్టి రోడ్డు పక్కన పార్క్ చేసిన ఆటోలో వదిలేశారని భావిస్తున్నారు.

మరోవైపు సల్మా మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. ఆమె హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి గురించి ఆధారం లభించిందని, అతడ్ని త్వరలో అరెస్ట్ చేస్తామని పోలీస్ అధికారి వెల్లడించారు.

# కీలక ఖనిజాల వ్యవస్థకు సంబంధించి పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించటానికి అత్యుత్తమ కేంద్రాల ఏర్పాటు

న్యూఢిల్లీ, అక్టోబర్ 26:జాతీయ కీలక ఖనిజాల మిషన్ (ఎన్‌సీఎంఎం) కింద ఇప్పటికే ఉన్న 7 సంస్థలతో పాటు మరో 2 సంస్థలను అత్యుత్తమ కేంద్రాలుగా గనుల మంత్రిత్వ శాఖ గుర్తించింది. వాటిలో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్ సీ), హైదరాబాద్ లోని సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సీ-ఎంఈటీ) ఉన్నాయి. గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ పీయూష్ గోయల్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ కార్యదర్శి ప్రొఫెసర్ అభయ్ కరంధికర్ సహ అధ్యక్షతన 24.10.2025న జరిగిన సమావేశంలో ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ అడ్వైజరీ కమిటీ (పీఏఏసీ) ఇచ్చిన ఆమోదం మేరకు ఈ కేంద్రాలకు అనుమతి లభించింది.

ఎలక్ట్రానిక్స్, రక్షణ రంగం, అంతరిక్షం వంటి వ్యూహాత్మక రంగాలతో పాటు అధునాతన సాంకేతికత, క్లీన్ ఎనర్జీ, మొబిలిటీ ట్రాన్సిషన్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలకు కీలక ముడి పదార్థాలు ముఖ్యమైన సరఫరా వ్యవస్థను ఏర్పరుస్తాయి. సమగ్ర వ్యవస్థాగత విధానంలో సాంకేతికతలను అభివృద్ధి చేయటానికి, ప్రదర్శించటానికి, అమలు చేయటానికి, ఉన్నత స్థాయి టెక్నాలజీ సంసిద్ధతా స్థాయి (టీఆర్ఎల్)ని, టీఆర్ఎల్ 7/8 పైలట్ ప్లాంట్, వాణిజ్య-పూర్వ ప్రదర్శన స్థాయిని చేరుకోవటానికి ఆర్ అండ్ డీ అవసరం. కీలక ఖనిజాల రంగంలో దేశ సైన్స్, సాంకేతికల సామర్థ్యాన్ని బలోపేతం చేయటానికి, ముందుకు తీసుకెళ్లటానికి నూతన, పరివర్తనాత్మక పరిశోధనలను ఈ సీఓఈలు చేపడతాయి.

కీలక ఖనిజాలపై పరిశోధన, అభివృద్ధిని సమర్థవంతంగా వినియోగించుకోవటానికి, ప్రతి భాగస్వామి సామర్థ్యాన్ని ఒకే వేదికపైకి తీసుకురావటానికి హబ్ అండ్ స్పోక్ నమూనాపై కన్సార్టియంగా ప్రతి అత్యుత్తమ కేంద్రం పనిచేస్తుంది. సీఓఈ మార్గదర్శకాల ప్రకారం, ప్రతి సీఓఈ (హబ్ సంస్థ) కన్సార్టియంలో కనీసం ఇద్దరు పారిశ్రామిక భాగస్వాములు, కనీసం ఇద్దరు ఆర్ అండ్ డీ లేదా విద్యా రంగ భాగస్వాములను చేర్చుకోవటం తప్పనిసరి. ఇప్పటివరకు గుర్తించిన 9 సీఓఈలు కలిసి సుమారు 90 పారిశ్రామిక, విద్య లేదా ఆర్ అండ్ డీ భాగస్వాములను తీసుకువచ్చాయి.

# మొంథాను తట్టుకునేందుకు సర్వసన్నద్ధం

హైదరాబాద్, అక్టోబర్ 26:మొంతా తుఫాన్ ప్రభావం కృష్ణాజిల్లా అంతట పడుతుందని ఈనెల 27 నుంచి 29 వరకు భారీ వర్షాలు కురుస్తాయనే సమాచారంతో జిల్లా కలెక్టర్ బాలాజీ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అధికారులు ,ప్రభుత్వ సిబ్బంది తుఫాను ప్రభావం ఉన్న మూడు రోజులు ఎట్టి పరిస్థితులను ఎటువంటి శెలవులు పెట్టవద్దని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలోని ప్రతి మండలంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి బస్సులను, లారీలను రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

తుఫాను ప్రభావంతో నష్టపోయే గ్రామాలను ముందుగానే గుర్తించారు. అధికారులు ముంపు గ్రామాల పై తక్షణమే తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధ్యయనం చేశారు. ఆహార పదార్థాల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టంఅధికారులు ఆదేశించారు. మచిలీపట్నం నగరంలోని ప్రజలు నాలుగైదు రోజుల వరకు సరిపడ కూరగాయలు సరుకులను నిత్యవసరాలు ముందుగానే భద్రపరుచుకున్నారు.

తుఫాను ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆందోళనతో నగరంలోని రైతు బజార్ వినియోగదారులతో కిక్కిరిసింది. సముద్రంలోని మత్స్యకారులు ఎవరూ వేటకి వెళ్ళవద్దని, ఒకవేళ ఎవరైనా వేటకు వెళితే తక్షణమే వారిని వెనక్కి వచ్చే విధంగా సమాచారం అందించాలనీ సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తీర ప్రాంతాలలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా రెవిన్యూ పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. తుఫాను ప్రభావిత గ్రామాలలో ఎప్పటికప్పుడు సమాచారం అందించడానికి అదే గ్రామంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఉండి పర్యావేక్షించాలని అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

బందరు ఆర్డిఓ స్వాతి, మత్స్య శాఖ జిల్లా అధికారి నాగరాజులు ఎప్పటికప్పుడు తుఫాను సమాచారాన్ని సిబ్బందికి సూచనలు ఇస్తూ ఉండాలని ఆదేశించారు. తుఫాను ప్రభావంతో నాగాయలంక ,కోడూరు మండలాల్లోని పలు గ్రామాలలో నష్టం జరిగే ప్రమాదంఉంది. అలాగే బందరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో కూడా ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా ఈ మండలాలపై రెవెన్యూ, పోలీస్ సిబ్బంది దృష్టి పెట్టాలి.

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సముద్ర స్నానాలకు వెళ్లే భక్తులకు తుఫాను ప్రభావంతో పోలీసులు సముద్ర స్నానాలు వెళ్ళవద్దని హెచ్చరికలు జారీ చేశారు. పర్యటకులు సముద్రం లోకి వెళ్లకుండా మంగినపూడి బీచ్, హంసలదీవి బీచ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తుఫాను ప్రమాదం పొంచి ఉన్న జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కలెక్టర్లను నియమించింది.

# సిరిసిల్లలో విషాదం.. పాముకాటుకు 18 నెలల చిన్నారి బలి

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 26:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం నెలకొంది. ఓ 18 నెలల చిన్నారి పాము కాటుకు బలైంది. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి మండలం అసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రమేశ్, సుమలత అనే దంపతులు తమ బిడ్డ(18 నెలలు) వేదాన్షితో కలిసి నివాసం ఉంటున్నారు. అయితే పసిపాప శనివారం రాత్రి తన ఇంటి ముందు ఆడుకుంటుండగా, పాము కాటేసింది. చిన్నారి ఆ నొప్పి భరించలేక గట్టిగా ఏడ్చింది. దీంతో అప్రమత్తమైన తల్లిదండ్రులు పాపను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.వేదాన్షి మృతితో రమేశ్, సుమలత గుండెలవిసేలా రోదించారు. కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# హెల్ టాటామని చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు ప్రసంశనీయం

## -బిసి కార్పొరేటర్ పూర్వ చర్మెన్ వకులాభరణం కృష్ణ మోహన్ రావు



హైద్రాబాద్ అక్టోబర్ 26 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సమాజం లో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు ప్రసంశనీయమని బిసి కార్పొరేటర్ పూర్వ చర్మెన్ వకులాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. హెల్ టాటామని చారిటబుల్ ట్రస్ట్ ఫండ్ రేసింగ్ లో బాగంగా సిటీ కల్చరల్ సెంటర్ లో పాటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వకులాభరణం ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వకులాభరణం మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు నడుపాలంటే ఖర్చుతో కూడుకున్న పని అని అవి ఆదాయ మార్గాలు ఎంచుకోవడం కోసం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఇలాంటి కార్యక్రమాలకు ఆదరించి ఆర్థికంగా ప్రోత్స హించ వలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమం లో హెల్ టాటామని చారిటబుల్ ట్రస్ట్ చర్మెన్ కాకుమాను జ్యోతి,ట్రస్ట్ సబ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక మాసం ప్రత్యేక పూజలు.. భక్తులతో ఆలయాలు కిటకిట



మెదక్, అక్టోబర్ 26: కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం మెదక్ మండలంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెదక్ మండల పరిధిలోని మంబోజి పల్లి, మాచవరం కోయగుట్ట మల్లికార్జున స్వామి ఆలయం, శివాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఃకార్తీక మాసం నేపథ్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా శివన్నామ స్మరణతో మార్మోగిపోయింది. ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్తీక మాసం అంటేనే పూజలు, శుభకార్యాలు, వ్రతాలకు ప్రత్యేకమని తెలిసిందే. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తే పుణ్యఫలం దక్కుతుందని భక్తుల విశ్వాసం. మరి కొందరు నదీ స్నానాలు, ఆలయ దర్శనాలు చేస్తుంటారు.

# పూర్తి స్థాయి డిజిటల్ వ్యవస్థల ఉపయోగం ద్వారా న్యాయ సంబంధిత చెల్లింపు ప్రక్రియలను సులభతరం చేస్తోన్న న్యాయ వ్యవహారాల విభాగం

న్యూఢిల్లీ, అక్టోబర్ 26:స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కింద సామర్థ్యం, పారదర్శకత, డిజిటల్ పాలనపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో న్యాయ శాఖకు చెందిన న్యాయ వ్యవహారాల విభాగం (డీఎల్ఏ).. 'ఎల్ఐఎంబీఎస్'ను (లీగర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అండ్ బ్రీఫింగ్ సిస్టమ్) 'పీఎఫ్ఎంఎస్'తో (పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ) అనుసంధానించడం ద్వారా విధానపరమైన సరళీకరణలో ఒక కీలక ముందడుగు వేసింది. న్యాయవాది ఫీజు చెల్లింపు ప్రక్రియ పూర్తి డిజిటల్‌గా మారేందుకు ఈ సంస్కరణ ఉపయోగపడనుంది. ఇది వ్యాపార సౌలభ్యం, డిజిటల్ ఇండియా అనే ప్రభుత్వ విస్తృత కార్యక్రమాలలో ఒక ముఖ్యమైన భాగంగా ఉంది.

గతంలో న్యాయవాదులకు ఫీజు చెల్లించే ప్రక్రియ భౌతికంగా ఉండేది. ప్రత్యక్ష తనిఖీ, పే - అకౌంట్స్ కార్యాలయానికి హార్డ్ కాపీలను సమర్పించటం వంటివి ఇందులో భాగంగా ఉండేవి. దీని ఫలితంగా తరచుగా ఆలస్యం జరిగేది. అంతేకాకుండా దస్త్రాల ఆధారంగా పనిచేయాల్సి వచ్చేది. మెరుగుపరిచిన ఈ-బిల్ మాడ్యూల్ ద్వారా ఇప్పుడు న్యాయాధికారులు, న్యాయవాదులకు ఫీజు చెల్లించే పూర్తి ప్రక్రియను ఎలక్ట్రానిక్ రూపంలో చేయచ్చు. పాత వ్యవస్థలో ఉన్న దస్త్రాల పని, జాప్యాలను ఇది తొలగిస్తుంది. ఇది మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో డిజిటల్ రికార్డుల భద్రతను బలోపేతం చేయటంతో పాటు చెల్లింపుల్లో ఏకరూపతను తీసుకొచ్చి.. సకాలంలో ప్రక్రియను పూర్తి చేసి, చెల్లింపులు జరిగేలా చూసుకుంటుంది.

ఈ-బిల్ మాడ్యూల్‌తో వచ్చిన మార్పులతో ఎల్ఐఎంబీఎస్ ప్లాట్‌ఫామ్‌లో న్యాయాధికారులు, న్యాయవాదులు రూపొందించిన బిల్లులు ఇప్పుడు డిజిటల్ పరిశీలన, మంజూరు, చెల్లింపు కోసం పీఎఫ్ఎంఎస్‌కు అందుతాయి. ప్రాసెసింగ్ సమయాన్ని తగ్గించడం, బిల్లులను ప్రత్యక్షంగా ట్రాక్ చేయటం, మానవ తప్పిదాలను తొలగించడం వంటి చర్యలతో ఈ ఏకీకరణ.. మొత్తం ప్రక్రియను కాగిత రహితంగా చేసింది. ప్రతి చెల్లింపు క్లెయిమ్‌కు సీఆర్ఎన్ (క్లెయిమ్ రిఫరెన్స్ నంబరు) ఉంటుంది. దీని ద్వారా పరిపాలన యంత్రాంగం ప్రత్యక్షంగా పురోగతిని తెలుసుకోవచ్చు. డీడీఓ (డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్) ధ్రువీకరించి, డిజిటల్‌గా సంతకం చేసిన తర్వాత.. భౌతికంగా ఎలాంటి దస్త్రాలు లేకుండానే పీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లింపులు నేరుగా లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాకు జమ అవుతాయి.

ఎల్ఐఎంబీఎస్ ద్వారా న్యాయవాదులు చెల్లింపుల కోసం న్యాయ వ్యవహారాల విభాగంలోని సీఏఎస్ (సెంట్రల్ ఏజెన్సీ సెక్షన్) ఫిబ్రవరి 2025లోనే ఈ-బిల్ మాడ్యూల్‌ను ఉపయోగించటాన్ని ప్రారంభించింది. ఈ వ్యవస్థను ఢిల్లీ హైకోర్టుతో సహా ఇతర న్యాయ సంస్థలకు విస్తరించేందుకు సన్నాహాలు చేస్తోంది. న్యాయాధికారుల కాలానుగుణ చెల్లింపుల కోసం ఎల్ఐఎంబీఎస్‌లో రిటైనర్ ఫీజు మాడ్యూల్‌ను రూపొందించే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తోంది.

ఈ ఏకీకరణ వల్ల డిజిటల్ పాలన బలోపేతం అవుతుంది. దీనితో పాటు వేగం, సామర్థ్యం మెరుగుపడుతుంది. జవాబుదారీతనాన్ని మెరుగుపరిచే ఈ వ్యవస్థ పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహిస్తుంది. ఈ ప్లాట్‌ఫామ్‌కు ఉన్న ఏకరూపత చట్టపరమైన రుసుముల చెల్లింపు ప్రక్రియల ప్రామాణీకరణను కూడా సులభతరం చేస్తుంది. అంతర్గత ప్రభుత్వ ప్రక్రియలను సరళీకృతం చేయడం, డిజిటల్ పరివర్తనను ప్రోత్సహించడం, సామర్థ్యాన్ని పెంపొందించటం ద్వారా పౌరుల కేంద్రీకృతంగా సేవలను మెరుగుపరచడం ద్వారా ఇది స్పెషల్ క్యాంపెయిన్ 5.0 లక్ష్యాలకు ప్రత్యక్షంగా దోహదపడు తోంది.

భౌతిక విధానాలను తొలగించడం, పని తీరును ప్రామాణీకరించడం ద్వారా న్యాయ వ్యవహారాల విభాగం.. ఈ సంస్కరణను ఇతర న్యాయ సంబంధిత రుసుం చెల్లింపులకు విస్తరిస్తూనే ఉంటుంది. ఇది 2047 వికసిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఉంది.

# అక్టోబర్ 30 నుంచి టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం

తిరుపతి, అక్టోబర్ 26: టీటీడీ ఆధ్వర్యంలో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవంఘనంగా నిర్వహించనున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భజన మండళ్లతో నామ సంకీర్తన, సామూహిక భజన, ధార్మిక సందేశాలు, మహనీయులు మానవాళికి అందించిన ఉపదేశాలను వెల్లడిస్తారని ఆలయ అధికారులు వివరించారు.

సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. నవంబర్ 1న ఉదయం 8.30 గంటలకు సామూహిక నామ సంకీర్తన, ఉదయం 9.30 గంటల నుంచి స్వామిజీలు భక్త కోటికి ధార్మిక సందేశం ఇవ్వనున్నారని పేర్కొన్నారు. అక్టోబర్ 31న ఉదయం 4.30 గంటలకు అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లపూజ నిర్వహిణ అనంతరం వేల సంఖ్యలో వచ్చే భజన మండలి సభ్యులతో సాంప్రదాయ భజనలు చేస్తూ సప్తగిరీశుని చేరుకుంటారని తెలిపారు.మహర్షులు, రాజర్షులు , పురందరదాసులు, వ్యాసరాజయతీశ్వరులు, శ్రీమాన్ అన్నమాచార్యులు, శ్రీకృష్ణదేవరాయలు లాంటి మహనీయులు భక్తిప్రపత్తు అడుగుజాడలలో నడిచి ఆ దేవదేవుని కృపకు అందరూ పాత్రులు కావాలనే ఉన్నతాశయంతో మెట్లోత్సవ కార్యక్రమాన్ని దాస సాహిత్య ప్రాజెక్టు చేపట్టిందన్నారు.

# వైద్య విద్యలో మారుతున్న పరిణామం- దేశంలో మరింత చవకగా

## అందుబాటులోకి రానున్న ఆరోగ్య సేవలను ప్రస్తావించిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 26:దేశంలో వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణలో వేగంగా మారుతున్న పరిణామాలను కేంద్రమంత్రి శ్రీ డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. గత 10 ఏళ్లలో భారత్‌లో ఆరోగ్య సేవలు మరింత చేరువలో, చవకగా, సమగ్రంగా మారాయని అన్నారు.

ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (యూసీఎంఎస్)54వ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల స్నాతకోత్సవంలో డాక్టర్ జితేంద్ర సింగ్ పాల్గొని ప్రసంగించారు. డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు డిగ్రీలు అందించారు. నేటి తరం వైద్య విద్యార్థులు మానవీయతను అలవర్చుకోవాలని.. నూతన ఆవిష్కరణలను స్వీకరించాలని ప్రోత్సహించారు.

గత పదేళ్ల కాలంలో దేశంలో వైద్య విద్యలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నట్లు కేంద్రమంత్రి శ్రీ జితేంద్ర సింగ్ తెలిపారు. వైద్య కళాశాలలు, శిక్షణ అవకాశాల బాగా పెరిగాయని అన్నారు. పదేళ్ల క్రితం కేవలం 45,000 యూజీ మెడికల్ సీట్లు మాత్రమే ఉండేవని వాటి సంఖ్య ఇప్పుడు 1.5 లక్షల దాకా పెరిగియని చెప్పారు. ఏయిమ్స్ వంటి సంస్థల విస్తరణ దేశంలోని వివిధ ప్రాంతాల్లో మెడికల్ విద్యను పొందే అవకాశాన్ని ప్రజాస్వామ్యీకరించిందని తెలిపారు. అధిక సంఖ్యలో మహిళలు వైద్య వృత్తిని కొనసాగించడానికి అవకాశం కలిగినట్లు పేర్కొన్నారు.

ఆరోగ్య సేవల సేవల మార్పును కేంద్రమంత్రి మూడు విధాలుగా 'సులభంగా, చవకగా, అందుబాటులో' అంటూ వర్ణించారు. ఆయుష్మాన్ భారత్, జన్ ఔషధి కేంద్రాలు వంటి పథకాలు ఆరోగ్య సంబంధిత విషయాల్లో రాష్ట్రం, పౌరుల మధ్య సంబంధాన్ని పునర్నిర్వచించడానికి కారణమని ఆయన ప్రశంసించారు. తన వైద్య వృత్తి నుంచి కథలను పంచుకుంటూ.. దేశంలో ఆరోగ్య బీమా అప్పటికే ఉన్న వ్యాధులను కూడా వర్తించేలా ఎలా అభివృద్ధి చెందిందో వివరించారు. ఈ మార్పును ఆయన 'ప్రజారోగ్య విధానంలో అత్యంత మానవీయ ఆవిష్కరణలలో ఒకటి'గా పేర్కొన్నారు.

దేశంలో తొలి స్వదేశీ యాంటిబయోటిక్ 'నాఫిథ్రోమైసిన్' హీమోఫీలియాకు విజయవంతమైన జన్యు చికిత్స పరీక్షలను 'న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్'లో ప్రచురించినట్లు, డా. జితేంద్ర సింగ్ తెలిపారు. ఇలాంటి ఆవిష్కరణలు రోగ నివారణ, చికిత్సా రంగంలో దేశాన్ని నాయకత్వం వైపు ఎదిగేందుకు దోహదపడతాయని అన్నారు. అధునాతన క్లినికల్ ట్రయల్స్, పరిశోధనలను నిర్వహించడంలో ప్రైవేట్ రంగంతో సహకరించాలని యూసీఎంఎస్, ఇతర సంస్థలను కోరారు 'సొంత సెక్టర్లలో పని చేసే యుగం ముగిసింది'' అని వ్యాఖ్యానిస్తూ.. విద్యాసంస్థలు పరిశ్రమ, ప్రభుత్వ ప్రయోగశాలలతో సమన్వయం కావాలని ప్రోత్సహించారు.

ఈ సందర్భంగా సంస్థ 54 సంవత్సరాల ప్రయాణాన్ని గుర్తుచేసే ఒక సావనీర్ విడుదల చేశారు. ఇది వైద్య విద్య, పరిశోధన, ప్రజా సేవలో కళాశాల సాధించిన మైలురాళ్లను ప్రతిబింబిస్తుంది. దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో పెరుగుతున్న సహకారాన్ని, ముఖ్యంగా సమూహ ఆధారిత ఆరోగ్య కార్యక్రమాల్లో జీటీబీ ఆసుపత్రి భాగస్వామ్యాన్ని ఈ ప్రచురణ ప్రస్తావించింది.

విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులు, వైద్య పరిశోధన, బోధనకు చేసిన కృషికి గుర్తింపుగా అధ్యాపకులకు పురస్కారాలు, పతకాలను డా. జితేంద్ర సింగ్ ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలను మంత్రి అభినందించారు. దేశంలోని రాబోయే వైద్య విద్యార్థులు దేశ ఆరోగ్య ప్రాధాన్యతలను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆరోగ్య రంగంలో మారుతున్న సవాళ్లను కేంద్ర మంత్రి శ్రీ డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. నేటి వైద్యులు "బై-ఫేసిక్ డిసీజ్ స్పెక్ట్రం" అనే కొత్త దశను ఎదుర్కోవాల్సి వస్తోందని,అంటే సంక్రమణ వ్యాధులు, అసంక్రమణ వ్యాధులు రెండూ కలిసి ఉండే పరిస్థితి, దీనికి తోడు వృద్ధాప్య జనాభా పెరుగుదల, వేగంగా మారుతున్న సాంకేతిక పరిణామాలు కూడా సవాళ్లుగా మారాయని చెప్పారు. కృత్రిమ మేధను వైద్య రంగంలో అనుసంధానించడం ద్వారా పెద్ద మార్పు తీసుకొచ్చే దిశగా సాగుతోందన్నారు. టెలీ-మొబైల్ క్లినిక్స్ ద్వారా ఏఐ వినియోగాన్ని ఆయన స్వయంగా ప్రయోగాత్మకంగా ఉపయోగించినట్లు పేర్కొన్నారు. ఏఐ రోగి మాతృ భాషలో మాట్లాడగలదని, మానవీయ పరస్పర చర్య ద్వారా ఓదార్పు అందించగలదని ఆయన అన్నారు, దీనిని సానుభూతితో ఆవిష్కరణను కలిపే హైబ్రిడ్ మోడల్‌గా అభివర్ణించారు.

ఆరోగ్య రంగ భవిష్యత్తును రూపొందించడంలో యువ గ్రాడ్యుయేట్ల ప్రత్యేక స్థానాన్ని గుర్తు చేస్తూ డాక్టర్ జితేంద్ర సింగ్ తన ప్రసంగాన్ని ముగించారు. "నేడు డిగ్రీలు పొందుతున్న వారు 2047లో దేశ స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరుపుకునే సమయానికి తమ వృత్తి జీవితంలో అత్యున్నత స్థానంలో ఉంటారు" అని తెలిపారు. "మీరు దేశాన్ని ఆరోగ్యంగా, ఆత్మనిర్భరంగా తీర్చిదిద్దే శిల్పులు కావడానికి విధి మీకు ఈ అవకాశం ఇచ్చింది" అని ఆయన పేర్కొన్నారు

ఈ కార్యక్రమం యూసీఎంఎస్ పాలకమండలి ఛైర్మన్ ప్రొఫెసర్ మహేష్ వర్మ స్వాగత ప్రసంగంతో ప్రారంభమైంది. ఆ తర్వాత ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని కళాశాలల డీన్, ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ బలరాం పాణి ప్రసంగించారు. కార్యక్రమానికి యూసీఎంఎస్‌కు చెందినక అధ్యాపకులు, విద్యార్థులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ వేడుక వైద్య విద్యను దేశీయ శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణ లక్ష్యాలతో సమన్వయం చేయాలన్న ప్రభుత్వ దృష్టిని ప్రతిబింబిస్తుంది.

# ఇబ్బందులు పోవాలంటే.. మన ప్రభుత్వం రావాలి : కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 26: రెండేళ్లుగా ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో మాకు తెలుసునని.. ఇబ్బందులు పోవాలంటే మన ప్రభుత్వమే రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బన్సీలాల్‌పేట డివిజన్‌లోని హమాలీ బస్తీలో మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బొడ్రాయి పండుగను బస్తీ వాసులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు.



ఈ సందర్భంగా హమాలీ బస్తీ వాసులు బీఆర్ఎస్ నేతలకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నేతలందరూ బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మాట్లాడుతూ పల్లెటూర్లలో మాత్రమే నిర్వహించే బొడ్రాయి పండుగ ను హమాలీ బస్తీలో ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

ప్రజలు అంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఒక్క సనత్ నగర్ నియోజకవర్గంలోనే కాకుండా హైదరాబాద్‌లో ఎక్కడ ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలిచే గొప్ప నాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని.. బుద్ధి చెప్పాలి అంటే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కారుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉండే మీ బంధువులకు.. స్నేహితులకు నవంబర్ 11 నాడు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, పద్మారావు నగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ లు హేమలత, టీ మహేశ్వరి, సునీత, బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, కొలన్ బాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన పలువురు నాయకులు, బస్తీవాసులు సత్యనారాయణ, సుభాష్, యాదగిరి, రవి, కుషాల్, వెంకటేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలోని ఎయిమ్స్ 50వ స్నాతకోత్సవంలో

## ప్రసంగించిన కేంద్ర ఆరోగ్య మంత్రి శ్రీ జే.పీ. నడ్డా

న్యూఢిల్లీ, అక్టోబర్ 26:కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జే.పీ. నడ్డా ఈ రోజు న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) 50వ వార్షిక స్నాతకోత్సవ కార్యక్రమంలో ప్రసంగించారు.

శ్రీ నడ్డా మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులను అభినందించారు. దేశంలో వైద్య శాస్త్రం, విద్య, రోగుల సంరక్షణను అభివృద్ధి చేయడంలో ఎయిమ్స్ అసమానమైన కృషిని ఆయన ప్రశంసించారు. యువ వైద్యులు సానుభూతితో సేవ చేయాలని, అత్యున్నత నైతిక ప్రమాణాలను పాటించాలని సూచించారు. దేశంలో పెరుగుతున్న ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చడానికి ఆవిష్కరణలను ఉపయోగించుకోవాలని కేంద్ర ఆరోగ్య మంత్రి ఉద్బోధించారు.

న్యూఢిల్లీలోని ఎయిమ్స్ గురించి శ్రీ నడ్డా మాట్లాడుతూ, "వైద్య శాస్త్రాలు, శిక్షణ, ఆరోగ్య సంరక్షణ రంగంలో ఎయిమ్స్ దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తనదైన స్థానాన్ని సంపాదించుకుంది" అని వ్యాఖ్యానించారు. వైద్య విద్య, అత్యాధునిక పరిశోధన, రోగుల సంరక్షణలో రాణించడం పట్ల సంస్థకు గల అపారమైన నిబద్ధతను ఆయన ప్రశంసించారు.

గత దశాబ్ద కాలంలో ఆరోగ్య సంరక్షణ, వైద్య విద్య రంగంలో దేశం సాధించిన అద్భుతమైన పురోగతిని ప్రముఖంగా ప్రస్తావిస్తూ... దశాబ్దానికి ముందు దేశంలో ఒకే ఒక ఎయిమ్స్ ఉండగా, నేడు దేశవ్యాప్తంగా వాటి సంఖ్య 23కు చేరిందని శ్రీ నడ్డా తెలిపారు. ఇది ప్రతి ప్రాంతానికీ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ, వైద్య శిక్షణను విస్తరించడం పట్ల ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తోందన్నారు.

గత 11 సంవత్సరాల్లో దేశంలో వైద్య కళాశాలల సంఖ్య 387 నుంచి 819 కి పెరిగిందని కేంద్ర ఆరోగ్య మంత్రి తెలిపారు. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లు 51,000 నుంచి 1,29,000 లకి, పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు 31,000 నుంచి 78,000 లకి పెరిగాయని ఆయన వివరించారు. రాబోయే ఐదు సంవత్సరాల్లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిల్లో అదనంగా 75,000 సీట్లు జోడిస్తున్నట్లు శ్రీ నడ్డా తెలిపారు.

ఎస్ఆర్ఎస్ డేటా ప్రకారం మాతాశిశు ఆరోగ్యంలో దేశం గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపిన కేంద్ర మంత్రి... ఎమ్ఎమ్ఆర్ 130 నుంచి 88కి, ఐఎమ్ఆర్ 39 నుంచి 27కి తగ్గిందన్నారు. యూ5ఎమ్ఆర్, ఎన్ఎమ్ఆర్‌లలోనూ వరుసగా 42 శాతం, 39 శాతం గణనీయ తగ్గుదల నమోదవడంతో పాటు.. ఈ రెండూ ప్రపంచ సగటులను మించిపోయినట్లు శ్రీ నడ్డా వివరించారు.

దేశంలో టీబీ వ్యాప్తి 17.7 శాతం తగ్గిందనీ, ఇది ప్రపంచ రేటు 8.3 శాతం కంటే రెండింతలు మెరుగైనట్లు ది లాన్సెట్ రిపోర్ట్ చెబుతోందని ఆయన పేర్కొన్నారు.

గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఉన్నత విద్యకు, పరిశోధనలకు చురుగ్గా తోడ్పడాలని కేంద్ర మంత్రి సూచించారు. వృత్తిపరమైన, నైతిక ప్రవర్తనలో రాణించడం ద్వారా ఎయిమ్స్ ప్రతిష్టాత్మక వారసత్వాన్ని, బ్రాండ్‌ను నిలబెట్టాలని వైద్య విద్యార్థులను కోరారు. జీవితాంతం అభ్యాసకులుగా, ఆవిష్కర్తలుగా ఉంటూ వైద్య శాస్త్ర అభివృద్ధికీ, కరుణతో సమాజ సేవ చేయడానికి కట్టుబడి ఉండాలని వారిని ప్రోత్సహిస్తూ శ్రీ నడ్డా తన ప్రసంగాన్ని ముగించారు.

నీతి ఆయోగ్ సభ్యుడు ప్రొఫెసర్ వీ.కే. పాల్ మాట్లాడుతూ, "మనల్ని పెంచి పోషించిన సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన గొప్ప సామాజిక బాధ్యత మనపై ఉంది. మీరు ముందుకు సాగుతున్న కొద్దీ శ్రేష్ఠతను మీ రోజువారీ అభ్యాసంగా... ఆవిష్కరణలను మీ మార్గదర్శక సూత్రాలుగా మార్చుకోండి" అని సూచించారు.

ఉన్నత విద్యను కొనసాగించడం, బోధించడం, మార్గనిర్దేశం చేయడం, తదుపరి తరం ఆరోగ్య సంరక్షణ నిపుణులకు స్ఫూర్తినివ్వడం గురించి విద్యార్థులు ఆలోచించాలనీ, తద్వారా 'వికసిత్ భారత్' దార్శనికత సాకారం కోసం సహకారం అందించాలని ఆయన కోరారు. జ్ఞానం, కరుణ, నిరంతర అభ్యాసం అనే బలమైన పునాదులపైనే నిజమైన జాతి నిర్మాణం సాధ్యపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో 50 మంది పీహెచ్‌డీ విద్యార్థులు, 95 మంది డీఎం/ఎంసీహెచ్ నిపుణులు, 69 మంది ఎండీలు, 15 మంది ఎంఎస్‌లు, నలుగురు ఎండీఎస్‌లు, 45 మంది ఎంఎస్సీ, 30 మంది ఎంఎస్సీ (నర్సింగ్), 18 మంది ఎం.బయోటెక్ గ్రాడ్యుయేట్లు సహా 326 మంది గ్రాడ్యుయేట్లకు పట్టాలు ప్రదానం చేశారు. ఆదర్శప్రాయమైన కృషి, అంకితభావంతో కూడిన సేవకు గానూ ఏడుగురు ఎయిమ్స్ వైద్యులను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు.

# బైక్ స్టంట్‌లో బీటెక్ విద్యార్థి మృతి..

## స్కిడ్ కావడంతో ఎగసిన నిప్పురవ్వలు

సిమ్లా, అక్టోబర్ 26: బైక్ స్టంట్ బెడిసికొట్టింది. బైక్ స్కిడ్ కావడంతో నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. స్టంట్ చేసిన బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మరణించాడు.ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నాగ్‌చాలాకు చెందిన 22 ఏళ్ల అనికేత్ బీటెక్ విద్యార్థి. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌తో పాపులర్ అయిన అతడు శనివారం అర్ధరాత్రి వేళ రీల్ కోసం ప్రయత్నించాడు. కిర్తాపూర్-మనాలీ నాలుగు లేన్ల రహదారిలోని మలోరి టన్నెల్ సమీపంలో బైక్‌పై స్టంట్ చేశాడు.

కాగా, ఆ స్టంట్ బెడిసికొట్టింది. అనికేత్ బైక్‌పై నియంత్రణ కోల్పోయాడు. టన్నెల్ మలుపు వద్ద రోడ్డుపై బైక్ జారడంతో నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో అనికేత్ మెడ విరిగింది. దీంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అనికేత్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించారు.

మరోవైపు ఈ ప్రమాదకర స్టంట్‌కు ప్రయత్నించమని అనికేత్‌ను ప్రేరేపించిన వీడియోగ్రాఫర్‌ను ఈ కేసులో నిందితుడిగా పోలీసులు పేర్కొన్నారు. మొబైల్ ఫోన్‌లు, కెమెరా ఫుటేజ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

# రూ.1.30 లక్షల నగదు స్వాధీనం

## -ఆరుగురు జూదరుల అరెస్ట్

నంద్యాల, అక్టోబర్ 26: పట్టణంలో ఒకచోట రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి చేసి పలువురు పట్టుకున్నారు. వన్ టౌన్ ఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణము టూ టౌన్ పరిధిలో రహస్యంగా పేకాట ఆడుతున్న వారి సమాచారం రావడంతో ఆకస్మికంగా దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురుని అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతుండడం టూ టౌన్ పరిధిలో ఉండటంతో వారిని ఆ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. వారి వద్ద నుంచి రూ. 1.30 లక్షల నగదు, నాలుగు సెల్ ఫోన్లు,పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరుగురి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

# ఫోటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



ఆదిలాబాద్, అక్టోబర్ 26: అనారోగ్యంతో సంవత్సరం క్రితం మృతి చెందిన తాండూర్‌కు చెందిన ఫోటో గ్రాఫర్ పంబాల రమేష్ కుటుంబానికి ఫోటో గ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ కుటుంబ భరోసా నుంచి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. గత సంవత్సరం రూ. 1,60 లక్షలు అందించగా వారి ఇద్దరు మైనర్ పిల్లల చదువు కోసం రాష్ట్ర అసోసియేషన్ నుంచి వచ్చిన రూ.10 వేలను ఆదివారం అందజేశారు.

ఈసందర్భంగా మంచిర్యాల జిల్లా కోశాధికారి ముక్కెర శ్రీనివాస్, కుటుంబ భరోసా ఇన్‌చార్జి నూనె సురేష్ మాట్లాడుతూ తమ సభ్యుడు అకాల మరణం చెందాడం బాధకరమని , వారి కుటుంబాన్నికి చేదోడు, వాదోడుగా ఉండేందుకు తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు రాజబాబు, బెల్లంపల్లి అధ్యక్షుడు ఆకుల వేణు, మిత్ర వేణు, తాండూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, శోభన్, రుకుం ప్రసాద్, శివ, బెల్లంపల్లి, తాండూర్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.






# తలలు పగులగొట్టి వృద్ధ దంపతుల దారుణ హత్య

హైదరాబాద్, అక్టోబర్ 26: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని మోరగుడి సమీపంలో వృద్ధ జంట దారుణ హత్యకు గురైంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగప్ప (60), ఓబులమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మరోవైపు ఓబులమ్మ అంగీకారంతో పెద్దక్క (53) తో సుమారు 30 ఏళ్లుగా నాగప్ప సహజీవనం చేస్తున్నాడు.

వారు తాడిపత్రి రహదారిలోని పెద్ద పసుపుల మోటులో ఇటుకల బట్టీలు నడుపుతున్నారు. నాగప్ప, పెద్దక్క తాడిపత్రిలో రహదారిలోని ఇటుకల బట్టీ వద్ద నివాసముంటున్నారు. ఓబులమ్మ తన ఇద్దరు కుమారులతో జమ్మలమడుగు పట్టణంలో ఉంటున్నారు. ఆదివారం ఉదయం నాగప్ప, పెద్దక్క తాడిపత్రి రహదారిలోని ఇటుకల బట్టీలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు రోకలి బండతో వారి తలలు పగలగొట్టి హతమార్చారు.

హత్యా జరిగిన ప్రదేశం పక్కనే ఉన్న గదిలోగల బీరువాలోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ హత్యలు డబ్బు కోసమా జరిగాయా.. ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కేశంపేట మండల యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

హైదరాబాద్, అక్టోబర్ 26: అఖిల భారత యాదవ హక్కుల సాధన సమితి కేశంపేట మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఆ సంఘం తాలూకా అధ్యక్షుడు నడికుడ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా కేశంపేట మండల అధ్యక్షుడిగా బొజ్జం శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా మల్లేశ్, కార్యదర్శిగా లింగం, సభ్యులుగా మల్లేశ్, అమ్రేశ్, దశరథ, గోపాల్, శేఖర్, రమేశ్, శ్రీనివాస్, మహేశ్, మల్లేశ్, శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా నడికుడ యాదగిరియాదవ్ మాట్లాడుతూ యాదవులు విద్యా, ఉద్యోగం, ఆర్థిక రంగాల్లో ప్రగతి సాధించాలన్నారు. పశు సంపదపై ఆధారపడి జీవిస్తున్న యాదవ సోదరులకు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

అదేవిధంగా బొజ్జం శ్రీశైలం మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్ష్య పదవిని కట్టబెట్టిన సంఘం సభ్యులకు రుణపడి ఉంటానని, యాదవ సామాజిక ప్రగతికోసం అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన కమిటీ యాదవుల హక్కుల సాధనకోసం పాటుపడుతుందన్నారు.

# క్రమశిక్షణ లేకుండా పాలన

## -నియోజకవర్గ మండల కాంగ్రెస్ అధ్యక్షులు



కరీంనగర్, అక్టోబర్ 26: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పాలన పారదర్శకంగా సాగుతుందని ధర్మపురి, బుగ్గారం, గొల్లపల్లి, వెల్గటూర్ మండల అధ్యక్షుడు సంఘనబట్ల దినేష్, వేముల సుభాష్, నిశాంత్ రెడ్డి, శైలేందర్ రెడ్డిలు అన్నారు ఆదివారం ధర్మపురి పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ ను ఉద్దేశించి దండుపాళ్యం సినిమాతో పోలుస్తూ మాట్లాడిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎటువంటి చర్చకు అయిన సిద్ధమని మీడియా ముఖంగా సవాల్ విసిరారని, దానిలో భాగంగా సిద్దిపేటకు మంత్రి అడ్లూరి వెళ్లి వెంకటేశ్వర స్వామి వారినీ దర్శించుకొని మీడియాతో మాట్లాడిన అనంతరం అక్కడికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ వచ్చి ప్రభుత్వం పైన తీవ్రమైన అవాస్తవ వ్యాఖ్యలను చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఏటువంటి ఆర్థిక క్రమశిక్షణ లేకుండ పాలన చేసారని అది అందరికి తెలుసునని, కరప్షన్ కు కేరాఫ్ అడ్రస్ గా ఉన్న బిఆర్ఎస్ నాయకులు గురించి మాట్లాడే అర్హత లేదన్నారు కాళేశ్వరం ప్రాజెక్టులో ఎంత అవినీతి జరిగిందో రాష్ట్ర ప్రజలకు తెలుసునని,వారి హయాంలో జరిగిన ఏ సంక్షేమ పథకాల అమలులో అయిన అందులో అవినీతే ఉంటుందని, మాజీ మంత్రి హరీష్ రావు గురించి మా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడితే వారి భజనపరులైన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కిషోర్ లు ఇష్టానుసారంగా మంత్రి అడ్లూరి గురించి మాట్లాడుతున్నారని, ఒక్క సారి ఆ ఎమ్మెల్యేలు వారి స్థాయిని మించి మాటాడుతున్నాడన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ అతను చేసిన ఇసుక దందా గురించి ప్రజలు తెలుసునని,కొప్పుల ఈశ్వర్ అధికారంలో ఉన్నప్పుడు ధర్మపురికి ఏమి అభివృద్ధి చేశాడో చెప్పాలని, చందాల పైన ఉద్యమాన్ని నడిపిన రసమయి బాలకిషన్ ఇప్పుడు ఇన్ని కోట్లు ఎలా సంపాదించారో చెప్పాలని, అధికారం కోల్పోయిన బాధలో కొప్పుల ఈశ్వర్ ఏం మాట్లాడుతున్నాడో వారికే అర్థం కావడం లేదని,మా ప్రభుత్వ హయాంలో త్రాగడానికి నీళ్ళు లేక బిందెలతో మహిళలు రోడ్లపైకి రావడం జరిగిందనీ, మా ప్రభుత్వంలో అలాంటి సంఘటనలు జరిగాయా అని, మీ ప్రభుత్వ హయాంలో పేపర్ లీకేజీలు, నోటిఫికేషన్లు సరిగా ఇవ్వక నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని, మా ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇప్పటి వరకు సుమారు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందని పేర్కొన్నారు.

ఇదే విధంగా అవాస్తవ ఆరోపణలు చేస్తూ ప్రభుత్వం పైన బురద జల్లే ప్రయత్నం చేస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, నాయకులు చిలుముల లక్ష్మణ్, సింహరాజు ప్రసాద్, రామ్ దేని మొగిలి, ఒజ్జల లక్ష్మణ్, బాలగౌడ్, రాజా గౌడ్ రాపర్తి సాయి, దాసరి పురుషోత్తం, బొల్లారపు పోచయ్య నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రష్యా అమ్ములపొదిలో 'బూరెవెస్ట్నిక్' సరికొత్త అస్త్రం..



న్యూఢిల్లీ, అక్టోబర్ 26: రష్యా అమ్ములపొదిలో మరో సరికొత్త అస్త్రం వచ్చి చేరింది. అణుశక్తితో నడిచే 'బూరెవెస్ట్నిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు.

అపరిమితమైన పరిధి కలిగిన ఈ క్షిపణి మోహరింపు కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని సాయుధ దళాలను ఆదేశించారు.

కాగా రష్యా సైన్యం ఇటీవల 'అణు' విన్యాసాలు నిర్వహించింది. పుతిన్ ఆ విన్యాసాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రష్యా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, ఇతర సైనిక కమాండర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. పరీక్షల సమయంలో 'బూరెవెస్ట్నిక్' క్రూయిజ్ క్షిపణి 15 గంటలపాటు గాల్లోనే ఉందని, 14 వేల కిలోమీటర్లు ప్రయాణించిందని సైనికాధికారులు ఆయనకు తెలిపారు.

అంతకుముందు సైనిక ఉన్నతాధికారులతో పుతిన్ భేటీ అయ్యారు. రష్యా సాయుధ బలగాల చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ జనరల్ వాలెరీ గెరాసిమోవ్ నేతృత్వంలోని కమాండర్లతో సంభాషించారు. సుమారు 10 వేల మందికిపైగా ఉక్రెయిన్ సైనికులను తాము చుట్టుముట్టామని గెరాసిమోవ్ తెలిపారు. 31 బెటాలియన్లతో కూడిన ఉక్రెయిన్ సాయుధ దళాల బృందాన్ని తాము అడ్డుకున్నామని చెప్పారు.

# ఐర్లాండ్ నూతన అధ్యక్షురాలిగా కేథరీన్ కన్నోలి

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: ఐర్లాండ్ అధ్యక్ష ఎన్నికల లో వామపక్షవాద స్వతంత్ర నేత కేథరీన్ కన్నోలి ఏకపక్షంగా ఘన విజయం సాధించారు. ఆమెకు సిన్ ఫెయిన్‌తోపాటు వామపక్ష పార్టీలన్నీ మద్దతిచ్చాయి. దాంతో ఆమె ప్రత్యర్థి, సెంటర్ రైట్ పార్టీ అయిన ఫైన్ గాయెల్ అభ్యర్థి హీథర్ హంప్రేయ్స్ ఘోర పరాజయం పాలయ్యారు.

ఈ ఎన్నికల్లో కేథరీన్‌కు మొదటి ప్రాధాన్య ఓట్లలోనే ఏకంగా 63 శాతం ఓట్లు దక్కాయి. హంప్రేయ్స్ కేవలం 29 శాతం ఓట్లతోనే సరిపెట్టుకున్నారు. కాగా బారిస్టరు అయిన కన్నోలి.. 2016 నుంచి చట్టసభ సభ్యురాలిగా ఉన్నారు. గాజాపై ఇజ్రాయెల్ దాడులను ఆమె బహిరంగంగా వ్యతిరేకించారు. ఇజ్రాయెల్‌ను టెర్రరిస్టు దేశంగా అభివర్ణించారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఐరోపా కూటమి సైనికీకరణనూ తప్పుబట్టారు. ప్రస్తుతం ఐర్లాండ్ అధ్యక్షులుగా మైఖేల్ డి హిగ్గిన్స్ ఉన్నారు.

# బీజేపీలో చేరిన మైనార్టీ నాయకులు, సిమెంట్ కార్మికులు



ఆదిలాబాద్, అక్టోబర్ 26:కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీకి చెందిన పలువురు కార్మికులు, పలువురు మైనార్టీ నాయకులు పోలవేణి పోషన్న ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. ఈ మేరకు ఆదివారం మంచిర్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి రఘునాథ్, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్, కాసిపేట మండల అధ్యక్షులు సూరం సంపత్ కుమార్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దేవునూరి సంతోష్ కుమార్, మండల ఉపాధ్యక్షులు బాకి కిరణ్, నాయకులు కసాడి రమేష్, రామిళ్ళ మహేష్, పోలవేణి పర్వతాలు, కోడూరి రమేష్, చిలుక మల్లేష్, సోల శ్రీనివాస్, కాలవేని రమేష్, జంగిలి రాజ్ కుమార్, జాడి లింగయ్య, సందవేణి సంజీవ్, పవన్, అంజి, రవీందర్, శ్రీనివాస్, రాకేష్, మహేష్, శివ, నవీన్, అభి, మైనార్టీ నాయకులు అనీఫ్, హరీఫ్, గౌస్, జమీర్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యాబోధన చేయాలి : అరుణ శ్రీ



హైదరాబాద్, అక్టోబర్ 26: ఓపెన్ స్కూల్ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యాబోధన చేయాలని టీఓఎస్ఎస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అరుణ శ్రీ సూచించారు. ఆదివారం పరిగిలోని జెడ్పీహెచ్ఎస్ నెం.1, జెడ్పీహెచ్ఎస్ నెం.2లను ఆమె సందర్శించి ఓపెన్ స్కూల్ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బోధన అందించాల్సిందిగా ఫ్యాకల్టీకి సూచించారు. తద్వారా మరింత సులువుగా అర్థమవుతుందని చెప్పారు.

ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరయ్యే విద్యార్థులు సమయం వృధా చేసుకోకుండా ప్రతిరోజు ఇంటి దగ్గర కనీసం గంట సమయం కేటాయించి చదువుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ విద్యార్థులకు కనీసం నియోజకవర్గ స్థాయిలో ఒక పరీక్షా కేంద్రం ఉంచితే అందుబాటులో ఉంటుందని పలువురు రాష్ట్ర కో-ఆర్డినేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం.గోపాల్, ఓపెన్ స్కూల్‌ల ప్రధానోపాధ్యాయులు, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# థాయ్‌లాండ్ రాజమాత సిరికిట్ కన్నుమూత

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: సంప్రదాయ చేతి వృత్తులను, అడవులను రక్షించేందుకు కృషిచేసిన థాయ్‌లాండ్ 'క్వీన్ మదర్ సిరికిట్ కిటియాకర శనివారం కన్నుమూశారు. ప్రస్తుతం ఆమె వయస్సు 93 ఏళ్లు. ఈనెల 17 నుంచి తీవ్ర అనారోగ్య సమస్యలతో బ్యాంకాక్‌లోని ఓ ఆస్పత్రిలో చేరిన ఆమె చికిత్సపొందుతూ మరణించారని ది రాయల్ హౌస్‌హోల్డ్ బ్యూరో ప్రకటించింది.

స్వతహాగా ప్రభావవంత మహిళ అయిన సిరికిట్ పుట్టినరోజును థాయ్‌లాండ్ ప్రజలు మాతృదినోత్సవంగా జరుపుకుంటారు.

1932 ఆగస్టు 12న ఓ ధనిక కుటుంబంలో సిరికిట్ జన్మించారు. 1950లో ఆమె అప్పటి రాజు భూమిబల్ అదుల్యతేజ్‌ను వివాహమాడారు. వీరికి ప్రస్తుత థాయ్‌లాండ్ రాజు మహా వజిరాలాంగ్‌కార్న్ సహా నలుగురు సంతానం ఉన్నారు.

గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన రాయల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల్లో కొన్నింటిని సిరికిట్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. వెనుకబడిన, పేద ప్రజల ఆదాయాన్ని పెంచడానికి, అంతరించిపోతున్న చేతి వృత్తులను సంరక్షించడానికి 1976లో 'సపోర్ట్ ఫౌండేషన్'ను ప్రారంభించారు. అంతరించిపోతున్న సముద్ర తాబేళ్లను కాపాడేందుకు వన్యప్రాణుల పెంపక కేంద్రాలు, బహిరంగ జంతు ప్రదర్శనశాలలను ఏర్పాటుచేశారు. అందుకే సిరికిట్‌ను గ్రీన్ క్వీన్‌గా పిలుస్తారు.

# తిరుమలలోని జలాశయాలు 95 శాతం నిండడం శుభ పరిణామం : టీటీడీ చైర్మన్



ఖమ్మం, అక్టోబర్ 26: కొన్ని రోజులుగా తిరుమల లో కురిసిన వర్షాలతో జలాశయాలు నిండు కుండను తలపిస్తున్నాయి. నీటి నిల్వలు పూర్తిస్థాయికి చేరుకోవడంతో పాపనాశనం డ్యామ్ వద్ద టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు ఆదివారం ప్రత్యేక పూజలు, గంగ హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ తిరుమలలోని జలాశయాలు 95 శాతం నిండిపోవడం శుభ పరిణామమని సంతోషం వ్యక్తం చేశారు.

పాపవినాశనం, గోగర్భం డ్యామ్‌లు పూర్తిగా నిండిపోవడంతో గేట్లు తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. భక్తుల అవసరం కోసం తిరుమలలో ప్రతిరోజూ 50 లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతుండగా, తిరుపతిలోని కళ్యాణి డ్యామ్ నుంచి 25 లక్షల గ్యాలన్లు, తిరుమలలోని డ్యామ్‌ల నుంచి 25 లక్షల గ్యాలెన్ల నీటిని వినియోగిస్తున్నామన్నారు.

తిరుమలలో 250 రోజుల నీటి అవసరాలకు సరిపడే నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. డ్యామ్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి అవసరాలను సక్రమంగా నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ శాఖను అభినందించారు.

టీటీడీ చరిత్రలో రికార్డుస్థాయిలో మొదటిసారి ఈ ఏడాది భారీ విరాళాలు వచ్చాయని తెలిపారు. గడిచిన 11 నెలల కాలంలో టీటీడీ ట్రస్టులకు రూ.918 కోట్లు విరాళాలు అందినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, సుధాకర్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గొర్రెల దొంగలపై చర్యలు తీసుకోకపోతే జాతీయ రహదారిపై ధర్నా చేపడుతాం



మహబూబ్‌నగర్, అక్టోబర్ 26: మాగనూర్, కృష్ణ ఉమ్మడి మండలాలలో కొన్ని నెలలుగా జరుగుతున్న గొర్ల దొంగతనాలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కురుమ సంఘం నాయకులు ఆరోపించారు.

పోలీసులు స్పందించకపోతే జాతీయ రహదారిపై గొర్రెలతో ధర్నా చేపడుతామని హెచ్చరించారు. ఉమ్మడి మండలాల్లో సుమారు 3 వందల గొర్రెలను, మేకలను దొంగిలించారని ఫిర్యాదులు చేస్తే పట్టించుకోవడం లేదని విమర్శించారు.

చర్యలు తీసుకుంటామని బాధితుల నుంచి రూ.20 వేలు పోలీసులు తీసుకున్నారని ఆరోపించారు. కర్ణాటకకు చెందిన దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. పట్టించిన దొంగలకు స్టేషన్ బెయిల్ ఇవ్వడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

మాగనూరు, కృష్ణ ఉమ్మడి మండలాలలో దాదాపు 16 మంది బాధ్యుల నుంచి దొంగతనాల ఫిర్యాదులు ఉండగా ఒక నాలుగు నుండి ఐదు కేసులు మాత్రమే ఎలా చేస్తారని ప్రశ్నించారు. రెండు , మూడు రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున గోర్లతో ధర్నాకు దిగుతామని కురుమ సంఘం నాయకులు హెచ్చరించారు.

# మైనార్టీ గురుకులాల్లో చదివి ఎంబీబీఎస్ చదివిన విద్యార్థులను సన్మానించిన కేటీఆర్, హరీశ్‌రావు



హైదరాబాద్, అక్టోబర్ 26:జహీరాబాద్ లోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలో చదివి ఎంబీబీఎస్‌లో సీటు పొందిన విద్యార్థులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సన్మానించారు. ఎంబీబీఎస్ సీట్ సాధించిన మైనార్టీ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులను కేటీఆర్ , హరీశ్ రావు శాలువతో సత్కరించి సన్మానించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ గురుకుల పాఠశాలలు పెట్టి మైనార్టీలకు నాణ్యమైన విద్యను అందించారని తెలిపారు. తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల వల్ల మైనార్టీలకు ఎంత లాభం జరిగిందనేది మీకే బాగా తెలుసు అని అన్నారు. మైనార్టీ వెల్ఫేర్ స్కూల్లో చదివి తల్లిదండ్రులకు, కేసీఆర్ కలను నిజం చేసిన మిమ్మల్ని సన్మానించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో 203 మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసింది కేసీఆర్ అని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ ఇబ్రహీం కుమారుడు ఒబేదు ఎంబీబీఎస్ సీటు సాధించారని అన్నారు.

ఒబేద్ తండ్రి ఇబ్రహీం మాట్లాడుతూ.. 'మేం ఒక్కటి నుంచి ఇంటర్మీడియట్ వరకు మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివించాం. కేసీఆర్ ప్రవేశపెట్టిన మైనార్టీ గురుకులాలు మా జీవితాలను మార్చేశాయి. ఈరోజు మా కుమారుడు డాక్టర్ చదువుతున్నాడు. మేము చాలా సంతోషంగా ఉన్నాం.' అని తెలిపారు. ఎంబీబీఎస్ సీటు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని ఒబేద్ తెలిపాడు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా మైనార్టీలకు గురుకులాలు నిర్మించి మాకు చదువు చెప్పడం మా అదృష్టమని అన్నాడు. 2016లో మైనార్టీ గురుకులాలో అడ్మిషన్ పొంది ఈరోజు ఎంబీబీఎస్ సీట్ సాధించామంటే అది కేసీఆర్ వల్లే అని తెలిపాడు.

జహీరాబాద్ మైనార్టీ గురుకులాల్లో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన తాసిల్ కమల్ మాట్లాడుతూ.. నీట్ లో 444 మార్కు వచ్చి గవర్నమెంట్ వనపర్తి లో సీట్ సాధించానని అన్నారు. మైనార్టీ గురుకులాల్లో మమ్మల్ని సొంత పిల్లల్లాగా చూసుకున్నారని తెలిపారు. నేను ఈరోజు ఎంబీబీఎస్ సాధించానంటే దానికి కారణం కేసీఆర్ అని పేర్కొన్నారు. మేము ఎప్పటికీ కేసీఆర్ గారికి రుణపడి ఉంటామని తెలిపారు.

రైతు కుమార్తె ఫిర్దోస్ మాట్లాడుతూ.. నేను జహీరాబాద్ మైనార్టీ గురుకులాలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివానని తెలిపారు. మంచి విద్యాబోధన అందించిన కేసీఆర్‌కు, బీఆర్ఎస్ ప్రభుత్వానికి మేము ధన్యవాదాలు చెప్పారు.' వేం అయిదుగురం అక్క చెల్లెళ్లం. ఒక తమ్ముడు ఉన్నారు. మా తండ్రి రైతు. తినడానికి కూడా చాలా కష్టంగా ఉండేది. అలాంటి మేము ఫీజులు కట్టి స్కూళ్లలో చదవలేకపోయాం. కేసీఆర్ నిర్మించిన మైనార్టీ గురుకులాల వల్లే నేను చదవగలిగాను. ఈరోజు డాక్టర్ చదువు కూడా చదువుతున్నాను.' అని అన్నారు.

ప్రియా ఏంజెల్ అని జర్నలిస్ట్ కుమార్తె మాట్లాడుతూ.. 'జహీరాబాద్ మైనార్టీ గురుకులంలో చదివి ఎంబీబీఎస్ అడ్మిషన్ సాధించారు. గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ వనపర్తిలో ఫ్రీగా ఎంబీబీఎస్ సీట్ సాధించడం నాకు ఎంతో గర్వంగా ఉంది. 2016లో జహీరాబాద్ మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్ పొంది 5వ తరగతి నుంచి ఉచితంగా ఇంటర్మీడియట్ వారికి చదివించారు. నా తండ్రి జర్నలిస్ట్. సరైన వేతనం లేక ప్రైవేట్ పాఠశాలలో చదివించడం మాకు ఇబ్బందిగా ఉండేది. కొన్ని సమస్య వల్ల ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండేవాళ్ళం. కేసీఆర్ నిర్మించిన గురుకులాల మా జీవితాలను మార్చేసింది. ' అని అన్నారు.

# ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉంటేనే జీవన ప్రమాణాలు మెరుగు : కలెక్టర్

హైదరాబాద్, అక్టోబర్ 26: ప్రతి మనిషి ఆరోగ్యాంగా ఉంటేనే జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఆదివారం ఉదయం అనంతగిరిలో తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ మొదటిసారిగా నిర్వహించిన ట్రయిల్ రన్ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్.. మనిషి జీవితంలో ఆరోగ్యమే ప్రధానమని, దేశ శ్రేయస్సు ఆరోగ్యకరమైన జనాభాపై ఆధారపడి ఉంటుందని తెలిపారు.

అనంతగిరి అటవీ ప్రాంతం ఔషధ మొక్కలకు నిలయమని, ఇక్కడి గాలి ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని, ఈ ప్రాంతంలో తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ట్రయల్ రన్ నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో 1000 మందికి పైగా తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నిర్వాహకులు 5ఐ, 10ఐ, 20ఐ, 32ఐ రన్ నిర్వహించి పథకాలు బహుకరించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ అనంతగిరి ఎకో అర్బన్ పార్క్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎంట్రీ గేట్ బాగుందని ప్రశంసిస్తూ, పనులలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, అడిషనల్ ఎస్పీ రాము నాయక్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో అమ్మాయిని వేధించిన వ్యక్తి.. చితకబాదిన స్నేహితులు

చెన్నై, అక్టోబర్ 26: ఒక వ్యక్తి ఆన్‌లైన్‌లో అమ్మాయిని వేధించాడు. ఈ విషయాన్ని తన స్నేహితుడికి ఆమె చెప్పింది. ఆ వ్యక్తిని అతడు హెచ్చరించాడు. అయినా వేధింపులు ఆపకపోవడంతో ప్రతీకారం తీర్చుకునేందుకు స్నేహితులతో కలిసి ప్లాన్ వేశాడు.

ఫేక్ ఐడీతో చాట్ చేసి అతడ్ని రప్పించారు. ఆ వ్యక్తి మొబైల్ ఫోన్ దోచుకున్నారు. తమిళనాడులోని సేలంలో ఈ సంఘటన జరిగింది. చెన్నైకి చెందిన బ్రాహ్మణయాగం అనే వ్యక్తికి ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లో మైనర్ బాలిక పరిచయమైంది.

కాగా, అతడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ అకౌంట్ తెరిచాడు. ఆ బాలికను ఆన్‌లైన్‌లో వేధించాడు. దీంతో స్నేహితుడైన రామకృష్ణన్‌కు ఈ విషయాన్ని ఆమె చెప్పింది. ఈ నేపథ్యంలో బ్రాహ్మణయాగంను అతడు హెచ్చరించాడు. వేధింపులు ఆపకపోవడంతో తన స్నేహితులతో కలిసి ప్లాన్ వేశాడు.

మరోవైపు రామకృష్ణన్, అతడి స్నేహితులు కలిసి సోషల్ మీడియాలో ఫేక్ ఐడీతో అకౌంట్ క్రియేట్ చేశారు.

బ్రాహ్మణయాగంతో చాట్ చేశారు. తెలివిగా అతడ్ని సేలం రప్పించారు. అక్కడి వంతెన వద్ద అతడ్ని అడ్డుకున్నారు. దొంగల మాదిరిగా నటించారు. బ్రాహ్మణయాగం మొబైల్ ఫోన్ లాక్కున్నారు. బైక్‌పై అక్కడి నుంచి పారిపోయారు. బాలికను వేధించిన చాటింగ్‌లు ఉన్న ఆ మొబైల్ ఫోన్‌ను వారు ధ్వంసం చేశారు.

అయితే ఆ రోడ్డుపై వెళ్తున్న ఒకరు దీనిని రికార్డ్ చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

ఇది పోలీసుల దృష్టికి వెళ్లడంతో దర్యాప్తు చేశారు. బ్రాహ్మణయాగం నుంచి మొబైల్ ఫోన్ దోచుకున్న రామకృష్ణన్, అతడి ఇద్దరు స్నేహితులను అరెస్ట్ చేశారు.

కాగా, అది నిజమైన దోపిడీ కాదని, ప్రతీకారమని పోలీసులు తెలుసుకున్నారు. బాలికను వేధించిన చాటింగ్‌లు ఉన్న బ్రాహ్మణయాగం మొబైల్ ఫోన్ చోరీ కోసం వారు ఈ ప్లాన్ వేశారని పోలీస్ అధికారి తెలిపారు. ధ్వంసం చేసిన ఆ మొబైల్ ఫోన్‌లోని స్క్రీన్ షాట్లను గుర్తించినట్లు చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# తేనె, దాల్చిన చెక్క పొడి కలిపి రోజూ తినండి.. ఎన్నో అద్భుతమైన లాభాలను పొందవచ్చు..

హైదరాబాద్, అక్టోబర్ 26: తేనెను మనం తరచూ తీసుకుంటూనే ఉంటాం. దీన్ని పలు పానీయాల్లో కలిపి తాగుతుంటాం. అలాగే తీపి పదార్థాల తయారీలోనూ తేనెను ఉపయోగిస్తుంటారు. ఇక దాల్చిన చెక్కను కూడా మనం వంటల్లో వేస్తూనే ఉంటాం. మసాలా వంటకాల్లో దాల్చిన చెక్కను వాడుతాం. దీన్ని నేరుగా అలాగే వంటల్లో వేస్తారు. లేదా పొడిగా చేసి కూడా వంటల్లో వేస్తుంటారు. దాల్చిన చెక్కను వేయడం వల్ల వంటకాలకు చక్కని రుచి, వాసన, రంగు వస్తాయి. అయితే తేనె, దాల్చిన చెక్క మిశ్రమం మనకు ఎన్నో లాభాలను అందిస్తుంది. ఒక టీస్పూన్ తేనెలో పావు టీస్పూన్ దాల్చిన చెక్క పొడి కలిపి రోజుకు 2 లేదా 3 సార్లు తీసుకోవాలి. దీని వల్ల పలు అనారోగ్య సమస్యలను నయం చేసుకోవచ్చు. ఆయుర్వేద ప్రకారం ఈ రెండింటి మిశ్రమం చక్కని ఔషధంగా పనిచేస్తుంది. ఇది మనకు అనేక లాభాలను అందిస్తుంది.

తేనె, దాల్చిన చెక్క మిశ్రమంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ మిశ్రమం యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటుంది. రెండింటిలోనూ పాలిఫినాల్స్, ఫినోలిక్ సమ్మేళనాలు అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఈ మిశ్రమాన్ని తీసుకుంటే శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీని వల్ల రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. ఈ మిశ్రమాన్ని తీసుకుంటే శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

తేనె, దాల్చిన చెక్క మిశ్రమాన్ని రోజూ తింటుంటే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ మిశ్రమంలో యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా దగ్గు, గొంతు సమస్యలు ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుంది. తేనె, దాల్చిన చెక్క మిశ్రమం గాయాలు, పుండ్లను మాన్పడంలోనూ అద్భుతంగా పనిచేస్తుంది. ఈ మిశ్రమంలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల దీన్ని రాస్తుంటే గాయాలు, పుండ్లు త్వరగా మానుతాయి. మొటిమలు తగ్గిపోతాయి. పలు రకాల చర్మ ఇన్‌ఫెక్షన్లు సైతం తగ్గుతాయి.

తేనె, దాల్చిన చెక్క మిశ్రమం అలర్జీలు ఉన్నవారికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఈ మిశ్రమాన్ని రోజూ తింటుంటే అలర్జీలు తగ్గిపోతాయి. అలాగే ఈ మిశ్రమంలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి కనుక దీన్ని రోజూ తింటే కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తింటుంటే ఫలితం ఉంటుంది. దీని వల్ల ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. గ్యాస్, కడుపు నొప్పి, కడుపు ఉబ్బరం, మలబద్ధకం నుంచి సైతం బయట పడవచ్చు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com